Assembles Of The Living Elohim (1. Tim 3:15) India presents........

రేపటి దినమును గూర్చి అతిశయపడకుము. ఏ దినమున ఏది సంభవించునో అది నీకు తెలియదు

Satyamunakai Poratam REGD. No. 67970 / 97

# సత్యమునకై పోరాటం

Editor & Publisher :
Bro. Isaac E. Kusuma
Malikipuram - 533 253
E.G. Dist. (A.P.) India.

Website : www.aotle-india.org
E-mail : satyamunakaiporatam@gmail.com
Office : Ph: 98493 85038

Regd. Monthly Newspaper
**Postal Regd. No. H/APM/01/2009-2011**
Valid upto 12/2011
Posted on 30th of Every Month
**Annual Subscription Rs. 50/-**

To :

VOLUME : 13 | ZIV 5772 (MAY 2011) | PAGES:4 | ISSUE 155

**హెచ్చరిక:- ఈ పత్రిక ఖండితముగా సత్యాన్వేషుల కొరకు మాత్రమే గాని క్రైస్తవ మతశాఖల వారి కొరకు కాదు**

# సాతాను టార్గెట్ - సాతానుకి టార్గెట్

బ్రదర్ ఐజక్ ఇ. కుసుమ

సాతాను అంటే మీ వయసంత లేక నా వయసంత ఉన్నవాడు కాదండి. వాడు చాలా సంవత్సరములనుండి ఉన్నవాడు. మన మూలపితరుడైన ఆదామునుండి ఎంతోమంది గొప్ప గొప్ప భక్తులను పడగొట్టుకుంటూ, వాళ్ళని నాశనం చేయడంలో ఎన్నో కుయుక్తులు, కుతంత్రాలు పన్నుతూ, వాళ్ళందరి విషయంలో ఎన్నెన్నో స్కెచ్‌లు గీస్తూ వచ్చిన గొప్ప విలన్ కారెక్టర్. వాడి అనుభవంలో మన జీవితం ఒక చిన్న నీటి బుడగలాంటిది. వీడి బారిన పడని భక్తులు అసలు ఉండరు. వీడికి భక్తులే టార్గెట్, భక్తుల కుటుంబాలే టార్గెట్. భక్తులను పాడుచేయడమే వీడి జీవిత టార్గెట్.

- ఆదామును పాడుచేయడానికి తన భార్యను వాడుకున్నాడు
- హేబేలును చంపడానికి తన సహోదరుడిని వాడుకున్నాడు
- ఎలోహీం కుమారులను పాడుచేయడానికి నరుల కుమార్తెలను వాడుకున్నాడు
- నరులను పాడుచేయడానికి వారి హృదయాలను వాడుకున్నాడు
- కుటుంబాలను పాడుచేయడానికి కుటుంబాలలో కొంతమంది వ్యక్తులను వాడుకున్నాడు
- ఇశ్రాయేలీయులను పాడుచేయడానికి ఐగుప్తీయులను వాడుకున్నాడు
- భక్తులను పాడుచేయడానికి వాళ్ల దగ్గర ఉన్న వ్యక్తులను వాడుకున్నాడు
- దీనాని పాడుచేయడానికి షెకెము రాజును వాడుకున్నాడు
- అబ్రహామును బాధించడానికి లోతును వాడుకున్నాడు
- శారాను బాధించడానికి హాగరును వాడుకున్నాడు
- ఇస్సాకును పరిహసించడానికి ఇష్మాయేలును వాడుకున్నాడు
- యాకోబును బాధించడానికి ఏశావును వాడుకున్నాడు
- రిబ్కాకు మనోవేదన కలుగజేయడానికి బాశెమతును వాడుకున్నాడు
- యోసేపును అమ్మివేయడానికి అతని అన్నలను వాడుకున్నాడు
- యోసేపును బాధించడానికి పోతీఫరు భార్యను వాడుకున్నాడు
- ఇశ్రాయేలీయులను బాధించడానికి ఐగుప్తులో ఫరోను వాడుకున్నాడు
- మోషేను బాధించడానికి ఇశ్రాయేలీయులను వాడుకున్నాడు
- మోషేపై తిరుగుబాటు చేయడానికి కొరహు, దాతాను, అబీరాములను వాడుకున్నాడు
- ఏలియాను బాధించడానికి యెజెబేలును వాడుకున్నాడు
- ఎలీషాని బాధించడానికి గెహాజీని వాడుకున్నాడు.
- ఇశ్రాయేలీయులను పాడుచేయడానికి బంగారు దూడను వాడుకున్నాడు
- యెహోషువను యిబ్బందిపరచడానికి కొంతమంది రాజులను వాడుకున్నాడు
- సంసోనును పాడుచేయడానికి దెలీలాను వాడుకున్నాడు
- ఏలీని పాడుచేయడానికి తన కుమారులను వాడుకున్నాడు
- సౌలును పాడుచేయడానికి అమ్మోనీయుల పశువులను వాడుకున్నాడు
- దావీదును బాధించడానికి అబ్షాలోమును వాడుకున్నాడు
- సొలొమోనును పాడుచేయడానికి అతని విగ్రహారాధిక భార్యలను వాడుకున్నాడు
- ప్రవక్తలను బాధించడానికి రాజులను, అబద్ధ ప్రవక్తలను వాడుకున్నాడు
- మీకాయను కొట్టడానికి సిద్కియను వాడుకున్నాడు
- షద్రకు, మేషాకు, అబేద్నెగోలను అగ్నిగుండంలో వేయడానికి కొండెములు చెప్పే కల్దీయులను వాడుకున్నాడు
- దానియేలును సింహపు బోనెలో వేయడానికి కొంతమంది మనుష్యులను వాడుకున్నాడు.
- బాలుడైన మెస్సీయను బాధించడానికి హేరోదు రాజును వాడుకున్నాడు
- యోహానును చంపడానికి హేరోదియను వాడుకున్నాడు
- యషువ మెస్సీయను అప్పగించడానికి ఇస్కరియెతు యూదాను వాడుకున్నాడు
- సౌలు-బర్నబాలను బాధించడానికి యూదయ భక్తిగల స్త్రీలను వాడుకున్నాడు
- సౌలును బంధకాలలో ఉంచడానికి ఫెలిక్సు రాజును వాడుకున్నాడు

ఇలా పరమతండ్రి భక్తులను ఇరకాటంలో పెట్టడానికి సాతానుగాడు ఎందరినో వాడుకున్నాడు. వాళ్ళ గొడవ అలా పెట్టి మనల్ని యిబ్బందులపాలు చేయడానికి, మనమీదికి ఎందరిని సాతానుడు రేపుతున్నాడో ఒక్కసారి ఆలోచిస్తే వాడి ప్లాన్‌లు/స్కెచ్‌లు అంతా మనకి అర్థం అయ్యిపోతుంది. వాడి క్రియలను లయపర్చడానికి ఒకే ఒక్క మార్గం మనకు ఉంది. అదే యషువ మెస్సీయ మాట వినడం: **అపవాది క్రియలను లయపర్చడానికే ఎలోహీం కుమారుడు ప్రత్యక్షమాయెను 1యోహాను 3:8.** సాతానుగాడి స్కెచ్‌లు/ప్లాన్‌లు అన్నీ పరమతండ్రికే తెలుసు గనుక పరమతండ్రి ఆత్మ ద్వారా వాటిని గ్రహించి, పరమతండ్రి చెప్పిన మార్గంలో నడచుకుంటేనే సాతానుగాడ్ని మనం జయించగలం. భక్తులు అదే చేసారు. మనమూ అదే విధంగా చేసి జయం పొందాలి. ముందు మనం స్వతంత్రులై యుండాలి, తరువాత విజయం మనదే అవుతుంది. చిక్కులలో పెట్టడం సాతాను గాడి పని. కాని పరమతండ్రి మనలను చిక్కులలో నుండి విడిపిస్తాడు. ఎవరైతే బలంగా ఉండి పరమతండ్రి పని చేస్తూ ఉంటారో వారిని ఏదో విధంగా చిక్కులలో పడవేయడానికి సాతాను ప్లేన్‌లు చేస్తుంటాడు. ఆ బలమైన వ్యక్తి వాడికి దొరకక పోతే, ఆ వ్యక్తిని బాధించడానికి తన భార్యనో, పిల్లలనో పట్టి వేదిస్తూ ఉంటాడు. తద్వారా ఆ వ్యక్తి బలహీన పడిపోతాడని సాతాను ఆలోచన.

– ఒకసారి దావీదు జీవితంలో ఇదే జరిగింది. దావీదు సర్వమూ కోల్పోయాడు 1సమూ 30:1-6. కాని **"తన ఎలోహీమైన యూవెను బట్టి ధైర్యం తెచ్చుకొని",** పరమతండ్రి మాటకై కనిపెట్టి పోగొట్టుకున్న ప్రతీదానిని, ఇంకా ఎక్కువగా తిరిగి రాబట్టుకున్నాడు. 1సమూ 30:6-31.

అదే విధంగా యోబు జీవితంలోనూ జరిగింది. ఎంతో నష్టపోయాడు యోబు 1:13-22, నష్టం వెనుక నష్టం, కష్టం వెనుక కష్టం అతనికి వచ్చింది. ఎంతో ఇష్టంతో భరించాడు గనుకనే రెట్టింపు ఆశీర్వాదం పరమతండ్రి ద్వారా పొందాడు. యోబు 42:12

గనుక భక్తునికి నష్టము అనేది బ్యాంకులో వేసుకునే డబ్బులాంటిది వడ్డీతో సహా తిరిగి మరళా వస్తుంది. ఇది అర్థం కాని వాడు కంగారు పడతాడు, అర్థం అయ్యిన వాడు వివేకంతో ఎదురుచూస్తూ ఉంటాడు.

– నాకు తెలిసిన ఒక మంచి భక్తుడున్నాడు. ఆయన భార్య ఒకసారి సాతాను ప్రేరణకు లోనై ఆయనను విశ్వాసుల ఎదుట ఆయనను దూషించింది. విశ్వాసులు అభ్యంతరపడిపోయి భార్యయే అలా మాట్లాడుతుంటే మనం మాట్లాడడంలో తప్పేముంది అనుకొని వాళ్ళు ఇష్టం వచ్చినట్లు ఆయనను మాట్లాడడం చేసారు. తరువాత భర్త-భార్య ఇద్దరూ బాగానే ఉన్నారు. ఇప్పుడు అల్లరి అయ్యిన వాళ్ళు ఎవరు? విశ్వాసులే గదా! విశ్వాసులకు ఎఫెసీ 5:31 వాక్యం తెలియదా?

–యోబు భార్య యోబును ఏదో అంది (యోబు 2:9)

– దావీదు భార్య దావీదును ఏదో అంది (2సమూ 6:16,20)

దానికి వారి భర్తలు సమాధానం చెప్పారు(యోబు 2:10+ 2సమూ 6:21,22) అవి కేవలం తాత్కాలికమైన ఉద్రేకాలలో భార్యలు మాటలాడిన మాటలు. వారు జీవితాంతము అలాగే మాట్లాడుకోవడం లేదు. వాటికి శిక్ష పరమతండ్రి వారికి ఇచ్చాడు. ఇవి భర్త-భార్యల మధ్య విషయాలు. ఇవి మూడవ వ్యక్తికి అవసరమా? అవసరం కాదు. కాని సాతానుకి, సాతాను అనుచరులకు ఇవి చాలా అవసరం. ఎందుకంటే సహోదరుల్లా (విశ్వాసులవలె) ఉంటూ కొంపలు ముంచువారు వీరే గనుక (యిర్మీయా 9:4-6). విశ్వాసులను కూడా సాతానుడు వాడుకుంటాడు. అందుకే విశ్వాసులు భక్తి మర్చిపోయి దారితప్పి సంఘాలలో రాజకీయములు చేస్తూ ఉంటారు. ముందు భక్తిగానే వస్తారు. కొంతకాలం తర్వాత సాతానుకి వశమై రాజకీయాలు నేర్చుకొని సాతానుకి ఏజెంట్లులా పనిచేస్తూ ఉంటారు. ఒక్కోసారి మా పాస్టర్ గారు (మా నాయకుడు/మా యాజకుడు) ఇంతకాదు అంతకాదు గొప్ప ప్రవక్త లేక సో అండ్ సో అని ఆకాశానికి ఎత్తేస్తారు. ఆ తర్వాత కొంతకాలం పోయాక ఇంకొకరి మోజులోపడి (విశ్వాసంలో లూజులో పడి) ఇవతల వ్యక్తిని ద్వేషిస్తూ దూషిస్తూ ఉంటారు. గనుక విశ్వాసులు కూడా సరియైన వ్యక్తులు కారు. సర్వసమాజము మోషే మీద అడ్డం తిరిగారని వాక్యంలో ఉంది. విశ్వాసులు స్థిరంగా ఉండరు. మేలు కలిగినప్పుడు ఒకరకంగా ఉంటారు, కీడు కలిగినపుడు వేరేరకంగా ఉంటారు. కొంచెం ధనం కలిగితే మరీ మూర్ఖుల్లా తయారు అవుతారు. వీళ్ళని కూడా టార్గెట్ చేసుకొని సాతాను పరమతండ్రి పనిని పాడుచేస్తూ ఉంటుంది. 25 సం॥రాలు బోధకుల్ని పరిశీలించిన నేను, విశ్వాసుల్ని కూడా పరిశీలిస్తున్నాను. వీళ్ళ గురించి, వీళ్ళ తప్పుడు గుణలక్షణములను గురించి 300కి పైగా రిఫరెన్సులతో వ్యాసం సిద్ధపరిచాను. త్వరలోనే ప్రచురిస్తాను. అప్పుడు చదవండి విశ్వాసులు అంటే ఏమిటి అనేది. అందుకేనేమో యెహోషువ ఆరులక్షల కాల్బలమైన విశ్వాసులతో (ఇశ్రాయేలీయులతో) ఒకసారి ఏమన్నాడో తెలుసాండీ! అయితే చదవండి యెహోషువ 24:15. నిజంగా పరమతండ్రి మీద ఆనుకొని జీవించే ఏ సేవకుడైనా యెహోషువ చెప్పినట్లే చెపుతాడు. కాని విశ్వాసుల మీదే జీవించేవాడయితే పరమతండ్రిని వదిలేసి విశ్వాసులు యిచ్చే డబ్బుని, కానుకలను ఆశించి విశ్వాసులు చెప్పినట్లు చేస్తూ బ్రతుకుతాడు. విశ్వాసం మీద జీవించేవాడు విశ్వాసుల మీద జీవించడు. విశ్వాసుల మీద జీవించేవాడు విశ్వాసం మీద జీవించలేడు. అయితే నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవిస్తాడని వాక్యం చెపుతుంది గనుక విశ్వాసులు ముఖ్యం కాదు, విజన్/దర్శనం ముఖ్యం. నిజమైన విశ్వాసికి నిజమైన సేవకుడు తెలుస్తాడు యోహాను 10:15, ఫిలిప్పీ 4:15-19, 2తిమోతి 1:15-18, గలతీ 4:13-15.

సాతానుగాడ్ని తక్కువ అంచనా వేయకండి. వాడు అభిషేకింపబడిన కెరూబు (యెహెజ్కేలు 28:14) వాడి సేవకులను వాడే అభిషేకించి మరీ పంపిస్తాడు (2కొరింథీ 11:13-15). ఎక్కడెక్కడ పరమతండ్రి సమాజములు ఉంటాయో అక్కడక్కడ ఒక్కొక్క కౌజుపిట్ట సంఘం (యిర్మీయా 17:11) కట్టమని పంపిస్తాడు. అందుకొరకు ప్రత్యేకంగా కొంత మందిని ఏర్పాటు చేసుకుంటాడు. మోషే కాలంలో కోరహు, దాతాను, అబీరాములను ఎన్నుకున్నాడు. యెహోషువ కాలంలో కూడా ఎన్నుకున్నాడు (యెహోషువ 22:19,20). వాడుకూడా పరమతండ్రి పిలిచినట్లే పిలుస్తాడు. సంఘాలలో గొడవలు వచ్చినప్పుడే పిలుస్తాడు వేరొక సంఘం కట్టమని. ముందు పిలవడు. ఇది బండ గుర్తు. వాడు అప్పుడే మాట్లాడతాడు, అంతకుముందు మాట్లాడడు. సాతానుగాడి గురించి క్లియర్‌గా చదవాలనుకుంటే ఈ రెండు రిఫరెన్సులు చాలా బాగా చదివితే అర్థం అవుతాడు. యెషయా 14:12-19, యెహెజ్కేలు 28:1-19, సాతాను గాడికి స్వంత పొలం లేదు. గనుక పరమతండ్రి పొలంలోనే విత్తనాలు విత్తుకుంటూ ఉంటాడు. మత్తయి 13:25-30. వాడికి బైబిలు లేదు గనుక పరమతండ్రిదే వాడుకుంటూ ఉంటాడు. అన్నీ పరమతండ్రి సేవకుల మాదిరినే అనుకరిస్తూ ఉంటాడు. (అ॥కార్య 19:11-16) డబ్బు ఎరపెట్టి వరములు పొందుకోమని పురుకొల్పుతాడు (అ॥కార్య 8:17-24) పరమతండ్రి బలిపీఠం లాంటిదే కడతాడు (యెహోషువ 22:19,20). పరమతండ్రి నామమునే ఉపయోగిస్తాడు (మత్తయి 7:22). పరమతండ్రే నన్ను పంపాడు, ఇలా చెప్పమన్నాడు అని మరీ చెపుతాడు (యెషయా 36:10) కొద్దో, గొప్పో, తేదీలు తేడాగా ఉన్నాగాని పరమతండ్రి పండుగల్లాంటివే చేస్తాడు (1రాజులు 12:32). ధైర్యం చేసేసి యాజకుడు కాకపోయినా ధూపం వేసేస్తాడు ( 1రాజులు 12:33). ఏ విధం చేతనైనా పరమతండ్రికి వ్యతిరేకంగా చేయడమే సాతానుగాడి టార్గెట్. కాని పరమతండ్రికీ ఏదో చేస్తున్నట్లు పబ్లిక్‌ని మోసగిస్తూ ఉంటాడు. అది వాడి నిజస్వరూపం. (1రాజులు 12:26-32) సాతానుగాడు చాలా సైలెంట్ కిల్లర్, సమయం వచ్చేవరకూ బయటపడడు (యెహెజ్కేలు 28:15), లోగుట్టు గలవాడు గాని ఇతరుల గుట్లు బయటపెడుతూ ఉంటాడు (సామెతలు 25:9,10) ఏమీ ఎరుగని అమాయకుడిలా, చాలా జాలిముఖం పెడుతూ ఉంటాడు (మత్తయి 26:25) గురువు దగ్గర ఉంటూనే గురువు శత్రువులను రహస్యంగా కలిసి వస్తూ ఉంటాడు. (మత్తయి 26:14-16) గురువు వద్దనుకున్నదానిని రహస్యంగా తెచ్చుకుంటాడు. (2రాజులు 5:22-25) స్కెచ్‌లు గీయడం, డిచ్‌లు తవ్వడం, పిచ్‌లు అమర్చడం వీడికి వెన్నతో పెట్టిన విద్య, కాని వాడికి వాడే ఉరిపెట్టుకుంటున్న సంగతి గ్రహించుకోడు (మత్తయి 27:3-5). సాతాను ఎప్పుడు పరమతండ్రి బిడ్డలనే టార్గెట్ చేస్తూ ఉంటాడు. వారిని వారి కుటుంబాలను అల్లరి చేయడానికి అనేక రకాల ప్రయత్నములు చేస్తూ ఉంటాడు. ఈ సంగతి సత్యసంబంధులైన సేవకులకు తెలుసు. వారు సాతానుని చాలా తేలికగా పసిగట్టగలరు. అయితే పరమతండ్రి సేవకులు కూడా సాతానుని టార్గెట్ చేసి కొడుతూ ఉంటారు. పరమతండ్రి జ్ఞానముతో వారు సాతానుని వారి కాళ్ళ క్రింద శీఘ్రముగా చితకత్రొక్కుతూ ఉంటారు. రోమా 16:20. పరమతండ్రి బిడ్డలు ఎప్పుడూ పరమతండ్రిని సంతోషపరచుచూ శత్రువులను మించిన జ్ఞానము కలిగి ఉంటారు. కీర్తనలు 119:98-100, లూకా 21: 14,15, అ॥కార్య 6:10



పస్కా పండుగ 2011

# జీవము గల దాని కొరకు ఎవరు వెదకుచున్నారు?

**ప్రియులారా! షలోం!** **- బ్రదర్. దిలీప్**

మీకును మీ ఇంటి వారికి శుభమని చెప్పి వ్రాయునది ఏమనగా!

మనము మన అవసరము తీర్చు విధముగాని, అవకాశముగాని మరియు మార్గము గాని ఉన్నదా? అని నిత్యము వెతికెదము. వెతికినది దొరికినంత వరకు వెతుకుదుము కదా? దాని నిమిత్తము మనము అవసరమును బట్టి ప్రదేశములను, వ్యక్తులను, వస్తువులను లేక ధనమును చివరికి బలమును కూడా ఉపయోగించెదము. కాని నేడు **జీవము గల దాని కొరకు ఎవరు వెదకుచున్నారు?** వెదకిన పిదప దొరికినది జీవమని ఎవరు గ్రహించుచున్నారు? మనకు దొరకనివి కొన్ని ఉన్నాయి, మనము వెతకనివి కొన్ని ఉన్నాయి, ఆలోచించనివి కొన్ని ఉన్నాయి, చూడనివి కొన్ని ఉన్నాయి. అనుభవించలేనివి కొన్ని ఉన్నాయి. అందుకోలేనివి కొన్ని ఉన్నాయి.

ఇహమందు మనము వెతుకునది ఎవరికి సంబంధించినది? ఆయన తన చిత్తమును నెరవేర్చుటకు నరులను వెతుకుచున్నాడు. నరులు ఆయన చిత్తమును నెరవేర్చగలరా? మనుష్యులు (మనము) నిజముగా ఎలోహీంను వెదకుచున్నారా? ఆయన మార్గము ఎక్కడ? ఏవిధముగా? ఎప్పుడు ఉన్నది? అని నిజముగా వెదకుతున్నారా?

**"నీతిమంతుడు లేడు, ఒక్కడును లేడు గ్రహించువాడెవడును లేడు. ఎలోహీంను వెదకువాడెవడును లేడు."**................ రోమా 3:11

**"సిగ్గుమాలిన జనులారా, కూడి రండి పొట్టు గాలికి ఎగిరినట్లు సమయము గతించుచున్నది. విధి నిర్ణయము కాకమునుపే యావె కోపాగ్ని మీమీదికి రాకమునుపే, మిమ్ములను శిక్షించుటకై యావె ఉగ్రత దినము రాకమునుపే కూడిరండి. దేశములో సాత్వికులై ఆయన న్యాయవిధులననుసరించు సమస్త దీనులారా, యావెను వెదకుడి మీరు వెదకి వినయము గలవారై నీతిని అనుసరించిన యెడల ఒకవేళ ఆయన ఉగ్రతదినమున మీరు దాచబడుదురు."**................ జెఫన్యా 2:1-3

**"నరులారా! ఎంతకాలము నా గౌరవమును అవమానముగా మార్చెదరు? ఎంతకాలము వ్యర్థమైనదానిని ప్రేమించెదరు? ఎంతకాలము అబద్ధమైనవాటిని వెదకెదరు?"**................ కీర్తన 4:2

ఆలోచింపుము! ఆయన మనలను ఏమి చేయమంటున్నాడు? ఏమి చేయవద్దంటున్నాడు? పరిశీలింపుము. వెదకుము. మనకు ముందున్న పని ఎలోహీంను వెదకుట, ఏలయనగా ఆయన సమస్తమును తన వాక్కు మూలముగా సృష్టి చేసి నరున్ని మాత్రము తన హస్తముతో చేసి తన జీవవాయువు ఊది, అధికారము, సహకారము మరియు సహవాసమును ఇచ్చెను.

**"ఎలోహీంనైన యావె నేల మంటితో నరుని నిర్మించి వాని నాసికారంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను."** ఆది 2:7

కాని నరుడు మాత్రము జీవించుటకు ఆయన తన లేఖనమును (వాక్కు) ఆధారము చేసియున్నాడు.

**"అందుకాయన:- మనుష్యుడు రొట్టెవలన మాత్రము కాదుగాని ఎలోహీం నోటనుండి వచ్చు ప్రతిమాట వలనను జీవించును అని వ్రాయబడి యున్నదనెను."**................ మత్తయి 4:4

**"మాటలు సిద్ధపరచుకొని యావె యొద్దకు తిరుగుడి"**................ హోషేయ 14:2

గుర్తెరుగుడి ఏ మాటలు సిద్ధపరచవలెను? అవి సత్యమైనవా? నిత్యమైనవా? జీవమైనవా? పరిశుద్ధమైనవా? మరియు వెలుగైనవా? మరి దేనివి?

**"హృదయమందు నిండియుండు దానిని బట్టి నోరు మాటలాడును గదా."**................ మత్తయి 12:34

మరియు ఆయన మనతో చాలా స్పష్టముగా మాటలాడుచున్నాడు.

**"నేను మీతో చెప్పునదేమనగా-మనుష్యులు పలుకు ప్రతి వ్యర్థమైన మాటను గూర్చియు విమర్శదినమున లెక్కచెప్పవలసి యుండును. నీ మాటలను బట్టి నీతిమంతుడవని తీర్పు నొందుదువు. నీ మాటలను బట్టియే అపరాధివని తీర్పునొందుదువు."**.......... మత్తయి 12:36,37

సత్యసంబంధులారా! మీరు వీటిని వివేచించుడి. నాకు తెలియపరచిన ప్రతీ విషయమును నీయెదుట ఉంచునట్లుగా ఎలోహీం నన్ను బలపరచెను. మరియు ఆయన మనకు అనేకమైన సంగతులు బోధించును.

**"నీవు జాగ్రత్తగా ఎలోహీంను వెదకిన యెడల సర్వశక్తుడగు ఎలోహీంను బతిమాలుకొనిన యెడల నీవు పవిత్రుడవై యథార్థవంతుడవైన యెడల నిశ్చయముగా ఆయన నీయందు శ్రద్ధ నిలిపి నీ నీతికి తగినట్లుగా నీనివాస స్థలమును వర్ధిల్లజేయును."**........ యోబు 8:5,6

**"వివేకము కలిగి ఎలోహీంను వెదకువారు కలరేమో అని యావె ఆకాశమునుండి చూచి నరులను పరిశీలించెను."**....... కీర్తన 14:2

ఆయన తన మాటను మార్చనివాడు. ఇచ్చిన వాగ్దానమైనా, చేసిన నిబంధన అయినా అది మారదు.

**"నా నిబంధనను నేను రద్దుపరచను నా పెదవులగుండా బయలు వెళ్ళిన మాటను మార్చను."**................ కీర్తన 89:34

**"ఆయన తన ప్రజలకు విమోచనము కలుగజేయువాడు. తన నిబంధన ఆయన నిత్యముగా ఉండనిర్ణయించువాడు."**..... కీర్తన 111:9

**"ఆయన శాసనములను గైకొనుచు పూర్ణహృదయముతో ఆయనను వెదకువారు ధన్యులు."**................ కీర్తనలు 119:2

నిజముగా స్నేహితులారా! మనము పూర్ణహృదయముతో ఆయనను వెతకాలి అంటే ఆయన శాసనములను గైకొనవలెనని చెప్పుచున్నాడు. మరియు ఆయన శాసనములు అనగా ఆజ్ఞలును మనము అంగీకరించి వాటి ప్రకారము జీవించినట్లైతే ఆయనను ప్రేమించగలము మరియు ఆయనను గూర్చి లేఖనములో అపోస్తలుడైన యోహాను ఇలాగు చెప్పుచున్నాడు:-

**"ఆయనను ఎరిగియున్నామని చెప్పుకొనుచు ఆయన ఆజ్ఞలను గైకొననివాడు అబద్ధికుడు; వానిలో సత్యము లేదు. ఆయన వాక్యము ఎవడు గైకొనునో వానిలో ఎలోహీం ప్రేమ నిజముగా పరిపూర్ణమాయెను."**................ 1యోహాను 2:4,5

**"మనమాయన ఆజ్ఞలను గైకొనుటయే ఎలోహీంను ప్రేమించుట ఆయన ఆజ్ఞలు భారమైనవి కావు."**................ 1యోహాను 5:3

**"పాపము చేయు ప్రతివాడును ఆజ్ఞను అతిక్రమించును ఆజ్ఞాతిక్రమమే పాపము."**................ 1యోహాను 3:4

**"ఆయన ఆజ్ఞలను గైకొనువాడు ఆయన యందు నిలిచియుండును. ఆయన వానియందు నిలిచియుండును."**....... 1యోహాను 3:24

జ్ఞాపకము చేసుకొందుము ఆయన తన మాటలు మన కొరకు ఆదిలోనే సిద్ధపరచియున్నాడు. వాటిని తప్పక గైకొనవలెనని ఆజ్ఞాపించియున్నాడు. అయితే అనేకులు ఆయన ఆజ్ఞలేవో తెలియని స్థితిలో ఉన్నారు. గ్రహించలేని స్థితిలో ఉన్నారు. ఏలయనగా మనము నేర్చుకున్న భయభక్తులు మానవుని మాటలను బట్టి వారి విధులను బట్టి వారి శాసనములను బట్టి నేర్చుకొనినవి.

మన రక్షకుడు మనతో ఈ విధముగా మాట్లాడుచున్నాడు:-

**"అందుకాయన వారితో ఈలాగు చెప్పెను-ఈ ప్రజలు పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని, వారి హృదయము నాకు దూరముగా ఉన్నది. వారు మానవులు కల్పించు పద్దతులు యావె ఉపదేశములని బోధించుచూ నన్ను వ్యర్థముగా ఆరాధించెదరు." "మీరు ఎలోహీం ఆజ్ఞను విడిచిపెట్టి, మనుష్యుల పారంపర్యాచారమును గైకొనుచున్నారు. మరియు ఆయన-మీరు మీ పారంపర్యాచారమును గైకొనుటకుఎలోహీం ఆజ్ఞను బొత్తిగా నిరాకరించుదురు." "మీరు నియమించిన మీ పారంపర్యాచారము వలన ఎలోహీంని, వాక్యమును నిరర్థకము చేయుదురు. ఇటువంటివి అనేకములు మీరు చేయుదురని చెప్పెను."**................ మార్కు 7:6-9,13

**"ఏలయనగా నా అంతట నేనే మాటలాడలేదు నేను ఏమనవలెనో, ఏమి మాట్లాడవలెనో దానిని గూర్చి నన్ను పంపిన తండ్రియే నాకాజ్ఞాపించియున్నాడు. మరియు ఆయన ఆజ్ఞ నిత్యజీవమని నేనెరుగుదును గనుక నేను చెప్పు సంగతులను తండ్రి నాతో చెప్పిన ప్రకారము చెప్పుచున్నాననెను."**................ **యోహాను** 12:49-50

మన రక్షకుడు సర్వాధికారియైన యషువ మెస్సీయ ఈ విధముగా చెప్పి సర్వజనులను ఆయన మాటలు వారి యొద్దను, వారు ఆయనయందును ఉండవలెనని చెప్పుచున్నాడు.

**"నాయందు మీరును మీయందు నా మాటలను నిలిచియుండినయెడల మీకేది ఇష్టమో అడుగుడి అది మీకు అనుగ్రహింపబడును."**

యోహాను 15:7

స్నేహితులారా! మనము ఆయనయందు నిజముగా నిలిచియున్నామా? ఆయన మాటలు మనయొద్ద నిలిచియున్నవా? లేక మానవుల (బోధకుల)యందు మనము, మనయందు వారి మాటలు నిలిచియున్నవా? పరిశీలించుడి, మనకు విశ్వాసము మాత్రమే సరిపోవునని నేటికాలపు బోధకులు బోధించుచున్నారు. విశ్వాసము చూచినదానిని బట్టి వచ్చునా? చూడక నమ్మినదానిని బట్టి వచ్చునా?

**"హృదయశుద్ధి గలవారు ధన్యులు; వారు ఎలోహీంను చూచెదరు."**................ మత్తయి 5:8

అని మనకు తెలియజేసియున్నాడు. కాని మానవుల హృదయమందు అనేకమైన విపరీతమైన ఆలోచనలు కలిగి బాల్యము నుండి చెడుతనముతో నింపుకొన్నారు.

**"నరుల చెడుతనము భూమిమీద గొప్పదనియు, వారి హృదయము యొక్క తలంపులలోని ఊహ అంతయు ఎల్లప్పుడు కేవలము చెడ్డదనియు యావె చూచి"**................ ఆది 6:5

మరి హృదయములో పరిశుద్ధమైన వాక్యమునకు అనగా సర్వశక్తుని ఆజ్ఞకు స్థానము లేక, సత్యము లేక, సమాధానము లేక నేను ఎలోహీంను ప్రేమించుచున్నానని అబద్ధసాక్ష్యమును మనుష్యుల యెదుటను సర్వశక్తుని యెదుటను చెప్పుచున్నాడు. మరియు విశ్వాసముతో నిలిచియున్నానని అద్భుతములు, మహాత్కార్యములు మరియు మహాసభలు ఇంకా ఎన్నో కార్యక్రమములు చేయుచున్నాడు. కాని అది సత్యమని, మార్గమని మరియు జీవమని నమ్మి అనేకులు మోసపోవుచున్నారు.

**"ఆయన మరియొక ఉపమానము వారితో చెప్పెను, ఏమనగా-పరలోకరాజ్యము, తన పొలములో మంచి విత్తనము విత్తిన యొక మనుష్యుని పోలియున్నది. మనుష్యులు నిద్రించుచుండగా, అతని శత్రువు వచ్చి గోధుమల మధ్యను గురుగులు విత్తిపోయెను. మొలకలు పెరిగి గింజపట్టినప్పుడు గురుగులు కూడా అగపడెను. అప్పుడు ఇంటి యజమానుని దాసులు అతని యొద్దకు వచ్చి- అయ్యా, నీవు నీ పొలములో మంచి విత్తనము విత్తితివి గదా, అందులో గురుగులెక్కడనుండి వచ్చినవని అడిగిరి.-ఇది శత్రువు చేసిన పని అని అతడు వారితో చెప్పగా, ఆ దాసులు-మేము వెళ్ళి వాటిని పెరికి కూర్చుట నీకిష్టమా? అని అతనిని అడిగిరి. అందుకతడు-వద్దు: గురుగులను పెరకుచుండగా, వాటితోకూడా ఒకవేళ గోధుమలను పెల్లగింతురు. కోతకాలమువరకు రెండింటిని కలిసి యెదుగనియ్యుడి; కోతకాలమందు గురుగులను ముందుగా కూర్చి వాటిని కాల్చివేయుటకు కట్టలు కట్టి, గోధుమలను నా కొట్టులో చేర్చి పెట్టుడని కోతగాండ్రతో చెప్పుదుననెను."** మత్తయి 13:24-30

**"మోసపోకుడి, ఎలోహీం వెక్కిరింపబడడు; మనుష్యుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును."**................ గలతీ 6:7

కాని ఈ లోకము ఆయన (ఎలోహీం) పొలముగా ఎంచబడినది. దీనిలో సాతానుడు గురుగులను గోధుమల మధ్య విత్తిపోయెను. రెండు విత్తనములే. రెండూ మొలకెత్తును రెండింటికీ సారము ఉండును. రెండింటికి ఆశీర్వాదము ఉన్నది. కానీ ఫలితము చివరికి వేరగుచున్నది. ఏలయనగా గోధుమ గోధుమే, గురుగు గురుగే. మరి ఇప్పుడు అనేకులు మేము సర్వశక్తుని యందు నిలిచియున్నమని అనుచున్నారు. అభివృద్ధి పొందుచున్నారు. ఆశీర్వదింపబడుచున్నారు. కాని తీర్పుదినమున ఫలితము వేరగుచున్నది. గొల్లవాడు మేకలలో నుండి తన గొర్రెలను వేరుపరచినట్లు ఆయన వారిని వేరుపరచి వారి వారి క్రియల చొప్పున జీతము ఇవ్వబడును.

**"అప్పుడు సమస్తజనములు ఆయనయెదుట పోగుచేయబడుదురు; గొల్లవాడు మేకలలోనుండి గొర్రెలను వేరుపరచునట్లు ఆయన వారిని వేరుపరచి తన కుడివైపున గొర్రెలను ఎడమవైపున మేకలను నిలువబెట్టును."**................ మత్తయి 25:32,33

**"ఇదిగో త్వరగా వచ్చుచున్నాను. వానివాని క్రియచొప్పున ప్రతివాని కిచ్చుటకు నేను సిద్ధపరచిన జీతము నాయొద్ద ఉన్నది."** ప్రకటన 22:12

**"యావె నాతో ఇట్లనెను-ప్రవక్తలు నా నామమునుబట్టి అబద్ధములు ప్రకటించుచున్నారు; నేను వారిని పంపలేదు, వారికి ఆజ్ఞ ఇయ్యలేదు, వారితో మాటలాడలేదు, వారు అసత్యదర్శనమును శకునమును మాయాతంత్రమును, హృదయమున పుట్టిన వంచనను ప్రకటన చేయుచున్నారు."**................ యిర్మీయా 14:14

**"కాపరులనేకులు నా ద్రాక్షతోటలను చెరిపివేసియున్నారు, నా సొత్తును త్రొక్కివేసియున్నారు; నాకిష్టమైన పొలమును పాడుగాను ఎడారిగాను చేసియున్నారు."**................ యిర్మీయా 12:10

మరియు ఆయన త్రోవ తప్పించు కాపరులను గూర్చి, బోధకులను గూర్చి ఇలాగు చెప్పుచున్నాడు-

**"నా ప్రజలు త్రోవతప్పిన గొఱ్ఱెలుగా ఉన్నారు. వారి కాపరులు కొండలమీదకి వారిని తోలుకొనిపోయి వారిని త్రోవ తప్పించిరి. జనులు కొండ కొండకు వెళ్ళుచు తాము దిగవలసిన చోటు మరచిపోయిరి."**................ యిర్మీయా 50:6

**"సహోదరులారా! ఆ కాలమును గూర్చి మీకు వ్రాయనక్కరలేదు. రాత్రివేళ దొంగ ఎలాగు వచ్చునో అలాగే ఎలోహీం (పరమతండ్రి) దినము వచ్చునని మీకు బాగుగా తెలియును." మీరందరు వెలుగు సంబంధులును, పగటి సంబంధులైయున్నారు. మనము రాత్రి వారము కాము. చీకటివారము కాము." "ఎందుకనగా మన రాజైన యషువ మెస్సీయ (రక్షకుని నిజమైన నామము) ద్వారా రక్షణ పొందుటకు ఎలోహీం మనలను నియమించెను గాని ఉగ్రతపాలగుటకు నియమింపలేదు. మనము మేలుకొనియున్నను, నిద్రపోవుచున్నను తనతో కూడా జీవించునిమిత్తము ఆయన (యషువ) మనకొరకు మృతిపొందెను."**................ 1థెస్స 5:1,2,5,9-10

**"జీవించువారు ఇకమీదట తమ కొరకు కాక తమ నిమిత్తము మృతిపొంది తిరిగిలేచిన వారికొరకే జీవించుటకు ఆయన అందరికొరకు మృతిపొందెననియు నిశ్చయించుకొనుచున్నాము."**................ 2కొరింథీ 5:15

**"మీరు విలువ పెట్టి కొనబడినవారు కనుక మనుష్యులకు దాసులు కాకుడి"**................ 1కొరింథీ 7:24

**"సహోదరులారా! ప్రతి మనుష్యుడు ఏ స్థితిలో పిలువబడెనో ఆ స్థితిలోనే ఎలోహీంతో సహవాసము కలిగియుండవలెను."** 1కొరింథీ 7:24

కాబట్టి సహోదరులారా!

**"మీరు ఈ లోకమర్యాదను అనుసరించక ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునైయున్న సర్వశక్తుని చిత్తమేదో పరీక్షించి తెలుసుకొనునట్లు మీ మనస్సు మారి నూతన మగుటవలన రూపాంతరము పొందుడి. సమస్తమును పరీక్షించి మేలైనదానిని చేపట్టుడి. (1థెస్స 5:21) "ప్రతి విధమైన కీడునకు దూరముగా ఉండుడి."**

ప్రియమైన సహోదరులారా!

**"సత్యమైనది దూరముగాను బహు లోతుగాను ఉన్నది దానిని పరిశీలన చేయువాడెవడు?"**................ ప్రసంగి 7:24

**"వివేకము కలిగి ఎలోహీంను వెదకువారు ఎవరు"**................ కీర్తనలు 14:2

**"నీతినిబట్టి సాక్ష్యము ఎవడు పలుకగలడు"**................ యెషయా 59:4

**"సర్వశక్తుని కార్యములను లక్ష్యపెట్టువారు ఎవరు? ఆయన వాక్యమందు సంతోషముగల వారు ఎవరు?"**

సహోదరులారా!

**"తండ్రి ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యము(వాక్యము)తోను ఆరాధించవలెను."**................ యోహాను 4:24

**"క్షయమైన ఆహారము కొరకు కష్టపడకుడి గాని అక్షయమైన ఆహారము కొరకే కష్టపడుడి ఇందు కొరకే మనము పిలువబడితిమి."** యోహాను 6:27

**"అక్రమము విస్తరించుట చేత అనేకుల ప్రేమ చల్లారును"**

ఏలయనగా వారు సత్యమును బట్టి జీవించలేదు. వారు మానవుల పద్దతులను, సంప్రదాయములను, విధులను, నీతిని మరియు జ్ఞానమును బట్టి పరలోకమందున్న తండ్రికి ఆరాధిస్తున్నారు.

**"విశ్వాసము లేకుండా ఎలోహీం(పరమతండ్రికి) ఇష్టుడై యుండుట అసాధ్యము"**................ హెబ్రీ 11:6

**"విశ్వసించితిని గనుక మాటలాడితిని"**................ 2కొరింథీ 4:14

**"నాయందు విశ్వాసముంచువాడెవడో లేఖనము చెప్పినట్టు వాని కడుపులో నుండి జీవజల నదులు పారునని బిగ్గరగా చెప్పెను." "మీరు విశ్వాసముగలవారై యున్నారో లేదో మిమ్మును మీరే శోధించుకొని చూచికొనుడి; మిమ్మును మీరే పరీక్షించుకొనుడి; మీరు భ్రష్టులు కాని యెడల యషువ మెస్సీయ (ఏసుక్రీస్తు అని పిలువబడుచున్న మన రక్షకుని నిజమైన నామము) మీలో ఉన్నాడని మిమ్మును గూర్చి మీరే ఎరుగరా?"**................ 2కొరింథీ 13:5

**ప్రతిదినము లేఖనము పరిశోధించవలసిన మనము ఏ యావెజనుడు చెప్పిన వాక్యమును అలా ఉన్నవో లేవో అనుదినము పరిశీలించవలసియున్నది"**................ అ॥కార్య 17:11

**"కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి"**................ మత్తయి 6:33

**"మన సర్వశక్తిమంతుడైన ఆ పరమతండ్రి మనకాజ్ఞాపించినట్టి ఈ సమస్తమైన ఆజ్ఞలను అనుసరించి మనము నడుచుకొనునప్పుడు మనకు నీతి కలుగును."**................ ద్వితీ 6:25

అంతేకాదు ఆయన పండుగలను న్యాయపద్ధతులను విధులను మనకు ఇచ్చియున్నాడు. వాటినిబట్టి ఆయనను ఆరాధింపవలసి యున్నది. మనుష్యులు ఏర్పాటు చేసిన దినములయందు ఉత్సహించి సంతోషించుట కాదు. మనకు **లేవీయకాండము 23:1-44**లో ఆయన నియామక కాలములు తెలియజేయుచున్నాడు. మనము వాటిని బట్టి ఆయనను మహిమపరచవలసియున్నది. అపోస్తలుడైన సౌలు కూడా మనలను **తీర్పులోనికి రాకుండా చూచుకొనుడి** అని హెచ్చరించుచున్నాడు (కొలస్సీ 2:16) పరిశుద్ధ గ్రంథములో మెస్సీయ జన్మదినము, మరణదినము మరియు పునరుత్థానదినము ఉన్నవి. ఇవి ఎప్పుడు చేసినా ఫరవాలేదు అన్నట్లుగా మనలను మోసపు మాటలతో అనేకులు నడిపించుటకు బయలుదేరి యున్నారు. ఆది అపోస్తలులు చేసిన విధానములను మార్చివేసిరి. దీనిని గ్రహించవలసిన మనము

**"అందరూ తమ సొంత కార్యములనే చూచుకొనుచున్నారు." ఫిలిప్పీ 2:21**

అని చెప్పిన విధముగా ఉండిపోతున్నాము.

## కావున నీవు ఈ ప్రజల నిమిత్తము ప్రార్థన చేయకుము

యిర్మీయా 11:14 - మీ ఆత్మీయ సహోదరి **దివ్య**

సర్వశక్తుని యందున్న ఆత్మీయ సహోదరులకు, సహోదరీలకు షలోం! ఆయన మాటలను మీకు తెలియపర్చుటకు అవకాశమిచ్చిన మహోన్నతునికి యుగయుగములు స్తుతి కలుగును గాక! సత్యమును అన్వేషించుటకు మనస్సు నిలిపిన మీకు, వెడల్పు ద్వారమున, విశాలమైన మార్గమున నాశనమునకై ప్రవేశించు అనేకులను గూర్చి వివరముగా తెలియజేయుటకు మీ ముందు ఆయన మాటలను ఉంచుచున్నాను. ఆయన ఉగ్రత ఎవరిమీద కుమ్మరింపబడనైయున్నదో గ్రహించగలిగితే, అంతమున ఎవడు రక్షింపబడునో సులువుగా గ్రహించగలము కదా!

**"మోసపోకుడి, సర్వశక్తుడు వెక్కిరింపబడడు. మనుష్యుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును. ఏలయనగా తన శరీరేచ్ఛలను బట్టి విత్తువాడు తన శరీరము నుండి క్షయమను పంటకోయును, ఆత్మను బట్టి విత్తువాడు ఆత్మనుండి నిత్యజీవమను పంట కోయును."** (గలతీ 6:7,8) అని అపోస్తలుడైన సౌలు చెప్పియున్నాడు.

కాగా మనము రక్షింపబడియున్నామని దృఢమైన విశ్వాసముతో నేడు అనేకులు తమ హృదయమును, ఆత్మను, మనస్సును, శరీరమును మోసము చేసుకొనుచున్నారు. మన పక్షమున పరిశుద్ధాత్మ విజ్ఞాపనము చేయుచున్నాడని ధైర్యము తెచ్చుకొని మారుమనస్సు పొందనొల్లకున్నారు. పరిశుద్ధాత్మ విజ్ఞాపన ఎవరి గూర్చినదైయున్నది?

**"అటువలె ఆత్మయు మన బలహీనతను చూచి సహాయము చేయుచున్నాడు. ఏలయనగా మనము యుక్తముగా ఏలాగు ప్రార్థన చేయవలెనో మనకు తెలియదు గాని, ఉచ్చరింపశక్యముగాని మూలుగులతో ఆ ఆత్మ తానే మన పక్షముగా విజ్ఞాపనము చేయుచున్నాడు. మరియు హృదయములను పరిశోధించువాడు ఆత్మ యొక్క మనస్సు ఏదో ఎరుగును. ఏలయనగా ఆయన సర్వశక్తుని చిత్తప్రకారము పరిశుద్ధుల కొరకు విజ్ఞాపనము చేయుచున్నాడు."** (రోమా 8:26,27) అని అపోస్తలుడైన సౌలు చెప్పుచున్నాడు.

పరిశుద్ధాత్మ విజ్ఞాపన పరిశుద్ధులను గూర్చియై యున్నది గాని, మారుమనస్సు అక్కరలేని వారి కొరకు కాదు. కావున మోసపోకుడి. మరియొక చోట ఇలాగు చెప్పబడియున్నది.

**"నరునికి నరుడు తప్పు చేసిన యెడల సర్వశక్తుడు విమర్శచేయును గాని యెవరైన యావె విషయములో పాపము చేసిన యెడల వాని కొరకు ఎవడు విజ్ఞాపనము చేయును?"** (1సమూయేలు 2:25) అని ఆనాడు యాజకుడైన ఏలీ యావె జనులను అతిక్రమింపజేసిన తన కుమారులకు హితవు పలికెను. అయినను వారు తమ తండ్రి మొఱ్ఱను ఆలకింపక యావె ఉగ్రత పాలైరి. ఇది

మారుమనస్సు అక్కరలేనివారికి దృష్ట్యాంతముగా ఉన్నది. ఇట్టివారు ఎంత మాత్రమును సర్వశక్తుని వాక్యమునకు లోబడక, తిరుగుబాటు చేయువారై పాపమునకు దాసులైయున్నారు. కావున వీరు పరమతండ్రి సంబంధులు కాక, అపవాది సంబంధులై యున్నారు. ఏలయనగా–

**"అపవాది మొదట నుండి పాపము చేయుచున్నాడు గనుక పాపము చేయువాడు అపవాది సంబంధి."** (1యోహాను 3:8) అని అపోస్తలుడైన యోహాను చెప్పియున్నాడు.

వీరిని గూర్చి రక్షకుడైన యషువ ఇలాగు చెప్పుచున్నాడు:–

**"నేను వచ్చి వారికి బోధింపకుండిన యెడల, వారికి పాపము లేకపోవును. ఇప్పుడైతే వారి పాపమునకు మిషలేదు."** (యోహాను 15:22)

ఆయన బోధను సహితము త్రోసివేసిన వీరిని గూర్చి మహిమగల సర్వశక్తుని రాజ్యములోనికి ప్రవేశింపకుండునట్లు తీర్పు విధించియున్నాడు. ఈ కఠినమైన తీర్పు ఎవరి నిమిత్తము చెప్పబడియున్నదో వివరముగా తెలుసుకొందుము.

**"కుక్కలును, మాంత్రికులును, వ్యభిచారులును, నరహంతకులును, విగ్రహారాధికులును, అబద్ధమును ప్రేమించి జరిగించు ప్రతివాడును వెలుపటనుందురు."** (ప్రకటన 22:15)

వాక్యానుసారముగా ఈ ఆరు గుంపులు ఎవరైయున్నారో ఎందుచేత వీరందరు క్షమాపణ పొందక సర్వశక్తుని ఉగ్రత పాత్రలోనిది త్రాగుటకు సిద్ధముగా ఉన్నారో పరిశోధించెదము.

1. **కుక్కల గుంపు: –** ఈ ఆరు గుంపులలో ముందుగా ప్రస్తావించబడిన ఈ గుంపు మాత్రమే జంతుపరమైన గుంపుగా పిలువబడింది. ఇందులో ఉన్నది మనుష్యులే గాని సర్వశక్తుడు వీరిని కుక్కలుగా సంబోధించాడు. ఏలయనగా–

**"కుక్కలు తిండికి ఆతురపడును, ఎంత తినినను వాటికి తృప్తిలేదు. ఈ కాపరులు అట్టివారే. వారు దేనిని వివేచింపజాలరు. వారందరు తమకిష్టమైన మార్గమున పోవుదురు. ఒకడు తప్పకుండ అందరు స్వప్రయోజనమే విచారించుకొందురు."** (యెషయా 56:11) అని సర్వశక్తుడు సెలవిచ్చియున్నాడు. మరియొక చోట **"మీరు క్రొవ్విన గొఱ్ఱెలను వధించి క్రొవ్వును తిని బొచ్చును కప్పుకొందురు గాని గొఱ్ఱెలను మేపరు. బలహీనమైన వాటిని మీరు బలపరచరు, రోగము గలవాటిని స్వస్థపరచరు, గాయపడిన వాటికి కట్టుకట్టరు, తోలివేసిన వాటిని మరల తోలుకొనిరారు, తప్పిపోయిన వాటిని వెదకరు, అది మాత్రమే గాక మీరు కఠిన మనస్కులై బలాత్కారముతో వాటిని ఏలుదురు."** (యెహెజ్కేలు 34:3,4) అని యావె వీరిపై నేరము మోపుచున్నాడు. నేడు అనేక సంఘములను కాయుచున్న కాపరులు ఇట్టిరీతిగా ఉన్నారు. కారా?

- ధనము గలవారిని వాడుకొని, వారి ధనమును ఉపయోగించుకొని వారి ఆత్మీయ జీవితములను అభివృద్ధిపరచక యున్నారు
- బలహీనమైన ఆత్మలను వాక్యముతో బలపరచకయున్నారు
- రోగము గలవారిని స్వస్థపరచకయున్నారు
- అనేక సమస్యల చేత గాయపడిన ఆత్మలను ఓదార్చకయున్నారు
- సమాజము నుండి అన్యాయముగా తోలివేసినవారిని, తిరిగి సమాజములోనికి రానివ్వకున్నారు
- రక్షకుని అంగీకరించి తిరిగి లోకములోనికి తప్పిపోయిన వారిని వెదకకున్నారు
- కఠిన మనస్కులై బలాత్కారముతో ఆత్మలను ఏలుచున్నారు గాని, మెస్సీయ ప్రేమను కనపరచకయున్నారు.

కావున వీరిపై సర్వశక్తుడు అత్యాగ్రహముతో ఇలాగు సెలవిచ్చుచున్నాడు–

**"నా జీవము తోడు నేను ఆ కాపరులకు విరోధినైతిని, నా గొఱ్ఱెలను గూర్చి వారి యొద్ద విచారించెదను, వారు గొఱ్ఱెలు మేపుట మాన్పించెదను, ఇకను కాపరులు తమ కడుపు నింపుకొనజాలక యుందురు. నా గొఱ్ఱెలు వారికి తిండి కాకుండ వారి నోట నుండి వాటిని తప్పించెదను, ఇదే సర్వశక్తుడైన యావె వాక్కు."**..........................................(యెహెజ్కేలు 34:10)

మరియు యావె ఇలాగు సెలవిచ్చుచున్నాడు:–

**"దాని యాజకులు నా ధర్మశాస్త్రమును నిరాకరించుదురు, నాకు ప్రతిష్ఠితములగు వస్తువులను అపవిత్రపరచుదురు, ప్రతిష్ఠితమైన దానికిని సాధారణమైన దానికిని భేదమెంచరు, పవిత్రమేదో అపవిత్రమేదో తెలుసుకొనుటకు జనులకు నేర్పరు, నేను విధించిన విశ్రాంతిదినములను ఆచరింపరు, వారి మధ్య నేను దూషింపబడుచున్నాను."** ..........................................(యెహెజ్కేలు 22:26)

- పవిత్రమైన సర్వశక్తుని నియామక కాలములు ఏవో అన్య ఆచారములనుండి సంక్రమించిన అపవిత్ర పండుగలేవో జనులకు నేర్పనందున వారు రక్షణ పొందక నశించుచున్నారు.
- ఆదినుండి సర్వశక్తునికిని, ఆయన ప్రజలకును సూచనగా ఉన్న విశ్రాంతిదినములను లక్ష్యపెట్టకయున్నారు. (యెహెజ్కేలు 20:20) వాటిని ఆచరింపకయున్నారు.
- ఆయన నియమించిన కట్టడను మార్చి నిత్యనిబంధనను మీరియున్నారు (యెషయా 24:5)
- ఆయన విశ్రాంతిదినమును ఆదివారమునకును, ఆయన మరణదినమును శుక్రవారమునకు మార్చి అన్య ఆచారములనుండి సంక్రమించి, పరిశుద్ధ గ్రంథములో ఎక్కడైనను లభించబడని, రక్షకుడైన యషువ, అపోస్తలులు సైతము ఆచరింపని పండుగలైన క్రిస్ట్‌మస్, ఈస్టర్, గుడ్‌ఫ్రైడే, జనవరి ఫస్టులను ప్రవేశపెట్టియున్నారు.
- ప్రతిష్ఠితమైన సర్వశక్తుని వాక్యమునకు, సాధారణమైన మనుష్యుల యొక్క పద్ధతులకు భేదము నెంచకయున్నారు.

ఇందును గూర్చి యషువ చెప్పినది సరియే–

**"ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది. మనుష్యులు కల్పించిన పద్ధతులు యావె ఉపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు."**.................... (మత్తయి 15:9)

– మరియు సర్వశక్తుని పరిశుద్ధ లేఖనములను ఆధారము చేసుకొని, ఆయన వాక్యము ఉన్నది ఉన్నట్లుగా బోధించువారిని "అబద్ధ ప్రవక్తలు, అబద్ధ బోధకులు" అను బిరుదులు ఇస్తూ, అలనాడు యషువ మాటలను నమ్మక, ఆయనను మెస్సీయగా అంగీకరింపక మరణమునకు అప్పగించిన వారి అడుగుజాడలను అనుసరించుచున్నారు. రక్షకుని ఆనాడు ఘోరముగా దూషించినవారిని పోలియున్నారు.

**"వారిలో అనేకులు-వాడు దయ్యము పట్టినవాడు, వెఱ్ఱివాడు, వాని మాట ఎందుకు వినుచున్నారనిరి."** .... (యోహాను 10:20)

అందుకు యషువ వారితో చెప్పిన మాట సరియే:–

**"అయితే మీరు నా గొఱ్ఱెలలో చేరిన వారు కారు గనుక మీరు నమ్మరు. నా గొఱ్ఱెలు నా స్వరము వినును, నేను వాటినెరుగుదును, అవి నన్ను వెంబడించును."**..........................................(యోహాను 10:26,27)

- మెస్సీయ స్వరము అనగా ఆయన వాక్యము విని, దానిని నమ్మకయున్నారు. వాక్యమును అనుసరించకయున్నారు. కావున వీరు ఆయన గొఱ్ఱెలలో చేరినవారు కారు.
- కాపరులలో అనేకులు వాక్యమును నిరర్థకము చేయుచూ, పాతనిబంధన, క్రొత్తనిబంధన అని వాక్యమును విభజించుచూ తాము మేపుచున్న గొఱ్ఱెలకు జీవవాక్యమును అందించకయున్నారు.
- వీరు ఇచ్చకపు మాటలతోను, ధనాపేక్షను కప్పిపెట్టు వేషముతోను తమ సంఘ విశ్వాసులను వినియోగించుకొనుచున్నారు గాని, వాక్యముతో వారిని హెచ్చరించువారు కారు. ఇందును గూర్చి–

**"యావెకు ప్రార్థన చేయక ఆహారము మ్రింగునట్లు నా ప్రజలను మ్రింగుచు పాపము చేయువారికందరికిని తెలివి లేదా?"** (కీర్తన 14:4, 53:4) అని సర్వశక్తుడు అడుగుచున్నాడు. ఆయన తన ప్రజల నిమిత్తము చింతించువాడైయున్నాడు. **"నా ప్రజలు త్రోవతప్పిన గొఱ్ఱెలుగా ఉన్నారు. వారి కాపరులు కొండల మీదికి వారిని తోలుకొనిపోయి వారిని త్రోవ తప్పించిరి. జనులు కొండ కొండకు వెళ్ళుచు తాము దిగవలసిన చోటు మరచిపోయిరి."** (యిర్మీయా 50:6)

- ఆయన వాక్యము నుండి తప్పిన గొఱ్ఱెలుగా నేటి విశ్వాసులున్నారు కారా?
- సంఘములలోనికి, సమాజములలోనికి జనులు వెళ్ళుచూ ఆయన రాజ్యమునకు పోవు ఇరుకు ద్వారమున ప్రవేశించక రక్షణ మార్గమును మరచియున్నారు. వీరి కాపరులు వాక్యమును పరిశోధించక వారిని జీవమార్గమునుండి తప్పించియున్నారు.

ఇందును గూర్చి యషువ ఈలాగు చెప్పియున్నాడు–

**"అయ్యో, వేషదారులైన శాస్త్రులారా, పరిసయ్యులారా, మీరు మనుష్యుల యెదుట పరలోక రాజ్యమును మూయుదురు, మీరందులో ప్రవేశింపరు, ప్రవేశించువారిని ప్రవేశింపనియ్యరు."** ........................................ (మత్తయి 23:13–15)

– సర్వశక్తునికి అనుకూలమైన వర్తమానమును అందించువారికి చెవియొగ్గరు.

– ఆయన వర్తమానమును అంగీరకించువారిని "అబద్ధ బోధ" అనుచూ, కనీసము లేఖనమును పరిశోధించు అవకాశమియ్యక అభ్యంతరపరచుదురు. వీరిని గూర్చి రక్షకుడైన యషువ మెస్సీయ చెప్పినది సరియే.

**"నా యందు విశ్వాసముంచు ఈ చిన్నవారిలో నొకని అభ్యంతరపరచువాడెవడో, వాడు మెడకు పెద్ద తిరుగటి రాయి కట్టబడి సముద్రములో పడవేయబడుట వానికి మేలు."** ........................................ (మార్కు 9:42)

- జీవము గల సర్వశక్తుని వాక్యము శరీరధారియై, కృపాసత్యసంపూర్ణుడైన యషువ మెస్సీయగా మన మధ్య నివశించెను........................................ (యోహాను 1:14)
- సర్వశక్తుని వాక్యమునందు విశ్వాసముంచువారిని అభ్యంతరపరచువారు ఆయన ఉగ్రతకు చచ్చువారైయున్నారు.
- భయంకరమైన ఆయన ఉగ్రతను రుచి చూచే కన్నా యషువ చెప్పినట్టు వాని మెడకు తిరుగటి రాయి కట్టి సముద్రములో పడవేయుట అట్టివారికి మేలే.
- పస్కా పశువుగా బలియైన యషువను మెస్సీయగా నమ్మని కాపరులు నేటికిని మనమధ్య ఉన్నారు. వీరు ఆనాడు యషువను నమ్మని యూదుల బాటలో తమ సంఘములను నడుపుచున్నారు. వీరు పరలోకమందు ప్రవేశించరు. ప్రవేశించువారిని ప్రవేశింపనియ్యరు.
- మరి అనేకులు యషువను రక్షకునిగా అంగీకరించినప్పటికీ, మనుష్యుల పద్ధతులకు, ఆచారములకు పట్టం కడుతూ, సర్వశక్తుని నియామక కాలములను, నిత్యనిబంధనను నిరర్థకము చేయుచున్నారు. ఆయన క్రమమును తప్పి అక్రమముగా నడుచుకొనుచున్నారు.

వీరి విషయమై యషువ తీసుకున్న నిర్ణయము సబబే:–

**"ఆ దినమందు అనేకులు నన్ను చూచి- సర్వాధికారీ, సర్వాధికారీ, మేము నీ నామమున ప్రవచింపలేదా? నీ నామమున దయ్యములను వెళ్ళగొట్టలేదా? నీ నామమున అనేకమైన అద్భుతములు చేయలేదా? అని చెప్పుదురు. అప్పుడు-నేను మిమ్మును ఎన్నడును ఎరుగను. అక్రమము చేయువారలారా, నాయొద్ద నుండి పొండని వారితో చెప్పుదును."**.....................................(మత్తయి 7:22,23)

- ఎన్నో ఆత్మలను విశాలమార్గములో నడిపిస్తూ, నరకప్రాప్తులుగా చేయుచున్నందున సర్వశక్తుడు మొదటగా వీరిని దండించదలచియున్నాడు.
- గొఱ్ఱెల విషయమై ఈ గుంపును సర్వశక్తుడు విచారణ చేయుటకై సిద్ధముగా ఉన్నాడు.

2. **మాంత్రికులు:–** వీరి గుంపులో గారడీవారు, చిల్లంగివారు కలగలిసియున్నారు. వీరు సర్వశక్తునికి విరోధముగా, ఆయన నీతికి విరోధముగా పనిచేయువారు. మాంత్రిక విద్యలు రాకున్ననూ ఆయన ప్రజలను విశ్వాసభ్రష్టులుగా చేయు ప్రతివాడును సర్వశక్తుని దృష్టికి మాంత్రికుడైయున్నాడు. ఇటువంటివారు అపోస్తలుడైన సౌలు కాలమునుండి మనమధ్య ఉన్నారు. వీరు అపవాది కుమారులైయున్నారు.

**"అయితే ఎలుమ ఆ అధిపతిని విశ్వాసము నుండి తొలగింపవలెనని యత్నము చేసి వారిని ఎదిరించెను. ఎలుమ అను పేరునకు గారడీవాడని అర్థము. అందుకు సౌలు పరిశుద్ధాత్మతో నిండినవాడై, అతని తేరి చూచి, - సమస్త దుర్మార్గముతో నిండినవాడా, అపవాది కుమారుడా, సమస్త నీతికి విరోధీ, నీవు సర్వాధికారి యొక్క తిన్నని మార్గములు చెడగొట్టుట మానవా?"** .....(అ॥కార్య 13:8–10)

- వీరు సమస్త నీతికి విరోధులైయున్నారు
- మెస్సీయ యొక్క తిన్నని మార్గములు చెడగొట్టువారైయున్నారు
- మరియు ఆసక్తితో వాక్యమును వినగోరినవారిని, విశ్వాసము నుండి తొలగించువారై యున్నారు. ఆత్మను ఆర్పివేయువారైయున్నారు
- ఇందును గూర్చి వీరిపై యషువ తన చేయి ఎత్తియున్నాడు........................ (అ॥కార్య 13:11)
- సర్వశక్తుడు వీరిని నిర్మూలము చేయదలచియున్నాడు........................ (మీకా 5:11,12)
- నేడు కొందరు అపోస్తలుల బోధను సైతం తప్పుబట్టుచూ అనేకులను విశ్వాస భ్రష్టులుగా చేయుచున్నారు.
- యషువ మరణించలేదనియు, ఆయన శిష్యులైన అపోస్తలులు చేపట్టిన సువార్తను అబద్ధమైనదిగా ఎంచి, విశ్వాసులను భ్రష్ఠపట్టిస్తున్నారు.
- అపోస్తలుల గురించి, యషువ గురించి ఇష్టానుసారముగా దూషిస్తూ, అంతర్‌జాలంలో(ఇంటర్‌నెట్) సహితము సర్వశక్తుని నీతికి విరోధముగా, సమస్త దుర్మార్గముతో నిండినవారై విమర్శలు వ్రాయుచున్నారు. వాటిలో ఒక్కటియైనను లేఖన ఆధారములు కావు. వీరి నిమిత్తము అపోస్తలుడైన యోహాను ఇలాగు చెప్పుచున్నాడు.

**"మెస్సీయ బోధయందు నిలిచియుండక దానిని విడిచి ముందునకు సాగు ప్రతివాడును సర్వశక్తుని అంగీకరింపనివాడు."** (2యోహాను 1:9)

- సర్వశక్తుని అంగీకరింపనివాడు అపవాది సంబంధి. వాని బోధ దయ్యముల బోధ. అసలు సిసలైన అబద్ధబోధ. వీరు అబద్ధికులై తమ తండ్రియగు అపవాది అడుగుజాడలను అనుసరించువారైయున్నారు.

వీరి నిమిత్తము అపోస్తలుడైన సౌలు ముందుగానే హెచ్చరించియున్నాడు–

**"అయితే కడవరి దినములలో కొందరు అబద్ధికులు వేషధారణవలన మోసపరచు ఆత్మలయందు దయ్యముల బోధయందును లక్ష్యముంచి, విశ్వాసభ్రష్టులగుదురని ఆత్మ తేటగా చెప్పుచున్నాడు."** ..........................................(1తిమోతి 4:1)

- వీరి కొరకు నాశనము ఎదురుచూచుచున్నది.

3. **వ్యభిచారులు:–** ఈ గుంపువారు శరీరము యొక్కయు, మనస్సు యొక్కయు కోరికలను నెరవేర్చుకొనువారు. తమ శరీరాశలను బట్టి ప్రవర్తించువారు. వీరు లోకముతో స్నేహము చేయువారైయున్నారు.

**"వ్యభిచారిణులారా, యీ లోకస్నేహము సర్వశక్తునితో వైరమని మీరెరుగరా? కాబట్టి యెవడు ఈ లోకముతో స్నేహము చేయగోరునో వాడు సర్వశక్తునికి శత్రువగును."** (యాకోబు 4:4) అని అపోస్తలుడైన యాకోబు చెప్పియున్నాడు.

ఏలయనగా: **"లోకములో ఉన్నదంతయు, అనగా శరీరాశయు, నేత్రాశయు, జీవపుడంబమును తండ్రివలన పుట్టినవి కావు. అవి లోకసంబంధమైనవే."** ........................................ (1యోహాను 2:16)

- దీనినిబట్టి ధన, కనక, వస్తు, వాహనాలపై వ్యామోహమున్న ప్రతివారును సర్వశక్తుని దృష్టికి వ్యభిచారులైయున్నారు.
- **వీటి నిమిత్తము సర్వశక్తుని వాక్యమును విసర్జించినవారు విశ్వాసఘాతకులై వ్యభిచారమనస్సు కలిగినవారైయున్నారు (యెహె 6:9)**
- కొందరు సంఘమును నడిపించు కాపరులైయుండి, సత్యవిషయమైన అనుభవజ్ఞానము ఎప్పుడును పొందలేని అవివేక స్త్రీలతో కాముకత్వము ప్రదర్శించుచున్నారు.......................... (2తిమోతి 3:6,7)
- ఈ గుంపువారు సర్వశక్తుని యొక్క రాజ్యమునకు హక్కుదారులు కాలేరన్నది నిశ్చయము (ఎఫెసీ 5:5)

4. **నరహంతకులు:–** **"నరహత్య చేయకూడదు."** (నిర్గమ 20:13) అని సర్వశక్తుడైన యావె పది ఆజ్ఞలలో ఒక ఆజ్ఞగా తన ప్రజలకు ఇచ్చియున్నాడు. ఆనాటి కయీను చేతులలో తన తమ్ముడైన హేబేలు రక్తమును సర్వశక్తుడు దృష్టించెను. నేటి నరహంతకులు తమ చేతులకు ఎంత మాత్రము రక్తమును అంటనియ్యక ఆత్మానుసారముగా సహోదరులను కుయుక్తిగా చంపుచున్ననూ, సర్వశక్తుడు వీరిని కూడా దృష్టించియున్నాడు.

**"తన సహోదరుని ద్వేషించువాడు నరహంతకుడు. ఏ నరహంతకుని యందును నిత్యజీవముండదని మీరెరుగుదురు."** (1యోహాను 3:15)

- కొందరు ద్వేషముతో తమ ఆత్మీయ సహోదరులను శారీరకముగా, మానసికముగా హింసించువారైయున్నారు
- ఇంకొందరు అసూయతో నింపబడి, సర్వశక్తుని సేవచేయుచున్న ఆత్మీయ సహోదరులకు చేయూతనివ్వకపోయి, వారి వ్యక్తిగత జీవితాలపై లేని పోని నిందలు పుట్టించుచూ, బురద జల్లుచూ, అడ్డుబండలుగా మారుచున్నారు.
- మరికొందరు సర్వశక్తుని నీతిని, కాక తమ స్వనీతిని స్థాపింపబూనుకొనుచూ, తమను సరిదిద్దుటకై ప్రయత్నించు ఆత్మీయ సహోదరులను అక్రమార్కులతో కొట్టించువారైయున్నారు.
- కొందరు కుయుక్తిగా పలు విధములైన శోధనలలో తమ సహోదరులను ఇరుకించువారైయున్నారు
- కొంతమంది నమ్మకముగా వెన్నంటే ఉండి వెన్నుపోటు పొడుచువారైయున్నారు
- నిశ్చయముగా వీరు తమ ఫలము పొందియున్నారు.

5. **విగ్రహారాధికులు:–** విగ్రహములను పూజించుటయే విగ్రహారాధన అన్న దృఢమైన భావన చాలామందిలో పాతుకుపోయింది. సర్వశక్తుని దృష్టిలో ఇది మాత్రమే విగ్రహారాధన కాదు.

–సర్వశక్తుని ఆజ్ఞను లక్ష్యము చేయక మూర్ఖతను అగపరచువారు విగ్రహారాధన చేయువారే (1సమూయేలు 15:23)

–ధనాపేక్షులు విగ్రహారాధికులే (కొలస్సీ 3:5)

–సర్వశక్తుని కన్నా మిన్నగా దేనినైతే తమ జీవితములో ప్రాముఖ్యమైనదిగా ఎంచుచున్నారో, దాని విషయమై వీరు విగ్రహారాధన చేయువారైయున్నారు.

–వీరు ఆయన దృష్టికి అవిధేయులైయున్నందున, సర్వశక్తుని ఉగ్రత వీరి మీదికి వచ్చును.

**"కావున భూమి మీదనున్న మీ అవయవములను, అనగా జారత్వమును, అపవిత్రతను, కామాతురతను, దురాశను, విగ్రహారాధనయైన ధనాపేక్షను చంపివేయుడి. వాటివలన సర్వశక్తుని-ఉగ్రత అవిధేయులమీదికి వచ్చును." (కొలస్సీ 3:5) అని వ్రాయబడియున్నది.**

6. **అబద్ధములాడువారు:–** యావె దృష్టిలో ఈ గుంపువారు ఇట్లు పిలువబడుటకు గల కారణమును అపోస్తలుడైన యోహాను వివరించుచున్నాడు–

**"ఆయనను ఎరిగియున్నామని చెప్పుకొనుచు, ఆయన ఆజ్ఞలను గైకొననివాడు అబద్ధికుడు. వానిలో సత్యము లేదు." (1యోహాను 2:4)**

వీరు సర్వశక్తుని ఎరిగియున్నామనుకుంటున్న అపవాది సంబంధులు. వీరి నిమిత్తము యషువ సరిగానే చెప్పెను.

**"మీరు మీ తండ్రియగు అపవాది సంబంధులు. మీ తండ్రి దురాశలు నెరవేర్చగోరుచున్నారు. ఆది నుండి వాడు నరహంతకుడైయుండి సత్యమందు నిలిచినవాడు కాడు. వానియందు సత్యమే లేదు. వాడు అబద్ధమాడునప్పుడు తన స్వభావము అనుసరించియే మాటలాడును. వాడు అబద్ధికుడును, అబద్ధమునకు జనకుడునై యున్నాడు."..........................................(యోహాను 8:44)**

గమనించండి. వీరికి తమ జనకుడైన అబద్ధికుని పోలికలే వచ్చినవి. వాడియందు సత్యము లేనట్టే, వాని పిల్లలైన అబద్ధికుల యందు సత్యము లేదు. సత్యమనగా నేమి? **"సత్యమందు వారిని ప్రతిష్ఠచేయుము. నీ వాక్యమే సత్యము."** (యోహాను 17:17) అని యషువ పలికెను.

- ఎవరైతే సర్వశక్తుని ఎరిగియున్నామని చెప్పుకొనుచు, ఆయన వాక్యమునందు నిలిచియుండరో వారందరు అబద్ధికులను, అపవాది కుమారులైయున్నారు.
- ఆయన ఆజ్ఞలు కొట్టివేయబడెనని చెప్పు ప్రతివాడు అబద్ధికుడే.
- యషువను మెస్సీయగా అంగీకరించని ప్రతివాడు అబద్ధికుడే........................ (1యోహాను 2:22)
- సర్వశక్తుని నియామక కాలములను గాక, ఈ లోకాధికారి ప్రవేశపెట్టిన పద్ధతులకు బద్ధుడై, సాతానుకు అమ్ముడుపోయిన ప్రతివాడును అబద్ధికుడే.
- వీరికొరకు పాతాళము కాచుకొనియున్నది.

**సర్వశక్తుని విషయములో పాపము చేసిన ఈ గుంపులలో ఉన్నవారికొరకు ఎవడు విజ్ఞాపనము చేయును?**

# విశ్వాసము లేకుండా ఎలోహీంనకు ఇష్టుడై ఉండుట అసాధ్యము - 3

ప్రియ సహోదరీ సహోదరులారా! అనంతమైన విశ్వాన్ని సృష్టించినవాడు ఆత్మస్వరూపియైన ఎలోహీం, ఆయన నామం **"యావె"** అని మనం విశ్వసించాలి. మన పితరులు ఆ విధంగానే నమ్మారు. ఆయనను పూజించారు. తమ జీవితాంతం ఆయన మీదనే ఆధారపడి జీవించారు. విశ్వాసం అనునది కృపావరాలలో ఒకటి. ఆత్మసంబంధమైనది. ఎందుకంటే యావె ఆత్మరూపి కాబట్టి. ఆ ఆత్మ ఆయనను నమ్మి వెంబడించువారందరిని ఆవరిస్తుంది. ఆ ఆత్మ వారిని నడిపిస్తుంది. ఊహింపశక్యము కాని విషయాలును ఆ ఆత్మవలననే గ్రహింపబడతాయి. భక్తుడైన దావీదు పరిశుద్ధాత్మ పూర్ణుడై ఈ సృష్టియొక్క రహస్యాలను శోధించి ఈ సృష్టియంతయు "యావె" వలన కలిగినది అని యెరిగి యున్నాడు. అందుకే **ఆకాశవాసులారా యావెను స్తుతించండి......సూర్యచంద్రులారా ఆయనను స్తుతించుడి. కాంతిగల నక్షత్రములారా ఆయనను స్తుతించుడి.....మృగములారా, పశువులారా, నేలను ప్రాకు జీవులారా........భూరాజులారా, సమస్త ప్రజలారా, భూమిమీద ఉన్న అధిపతులారా, సమస్త న్యాయాధిపతులారా యావెను స్తుతించుడి. యౌవనులు, కన్యలు, వృద్ధులు బాలురు అందరును "యావె" నామమును స్తుతించుదురు గాక అని కీర్తిస్తున్నాడు (కీర్తనలు 148).** సర్వశక్తిమంతుడైన యావె యందు విశ్వాసముంచి తమ జీవితాంతం ఆ విశ్వాసం మీదనే ఆధారపడి జీవించి, ఆ విశ్వాసముతో ఎంతో బలమైన అసాధ్యమైన కార్యాలు జరిగించిన భక్తులు అనేకులు ఉన్నారు. వారిని గురించి మనం పరిశుద్ధ గ్రంథంలో చూడగలం. అటువంటి విశ్వాసపరుల జీవితాలను తరచుగా అధ్యయనం చేయడం వల్ల మనం విశ్వాసవిషయములో బలపడతాం, స్థిరపడతాం. అందుకే **"నీతిమంతుని జ్ఞాపకం చేసుకొనుట ఆశీర్వాదకరం"** అని లేఖనం సెలవిచ్చుచున్నది. పరిశుద్ధ గ్రంథం చాలా విరివిగా లభించుచున్న ఈ రోజులలో అందరూ లేఖనములను చదువుచున్నారే గాని వాటిని తమ జీవితానికి అన్వయించుకోవడం లేదు. అందుకనే 200 కోట్ల విశ్వాసులు ఉన్నా అసలే ప్రభావం లేకుండా రోజులు గడిచిపోతున్నాయి. వీరి విశ్వాసం కొయ్యగుర్రం టైపు. కొయ్యగుర్రంపైకెక్కి గంటసేపు ఊగినా అంగుళం కూడా ముందుకెళ్ళము. అలాగే అపరిపూర్ణమైన విశ్వాసంతో మనం ఏమీ సాధించలేము. ప్రస్తుతం మానవుని సగటు జీవితకాలం 70 లేదా 80 సంవత్సరాలు. ఈ కొద్ది కాలములోనే మనం ఎలోహీంనందు సరియైన విశ్వాసం ఉంచలేకపోతున్నాము. కాని పితరులు వందలకొలదీ సంవత్సరాలు ఎలోహీంనందు విశ్వాసముంచారు. వారు మనలాగే సంసారిక జీవనాన్ని గడిపిన సామాన్యులే. **"హానోకు మెతూషెలను కనిన తర్వాత మూడు వందల యేండ్లు ఎలోహీంతో నడచుచు కుమారులను కుమార్తెలను కనెను."** అలా నడచి నడచి 365 యేండ్లు నడిచిన తర్వాత ఎలోహీం హానోకును తీసుకొనిపోయెను. ఇక ఆ తరమువారిలోనే నీతిమంతుడు అని పేరు తెచ్చుకున్న నోవహు 950 ఏండ్లు విశ్వాసంతో జీవించాడు. అదేవిధముగా యావె యందు విశ్వాసముంచుచున్నాము అని చెప్పే ప్రతి ఒక్కరు తమ మరణం వరకూ పరిపూర్ణ విశ్వాసంతో జీవించాలి. ఎలోహీం దూత దానియేలుతో **నీవు అంత్యము వరకు నిలకడగా ఉండిన యెడల విశ్రాంతినొంది కాలాంతమందు నీ వంతులో నిలిచెదవు** అని సెలవిచ్చుచున్నాడు. **అంతము వరకు సహించువాడెవడో వాడే రక్షింపబడును** (మత్తయి 24:13) అని రక్షకుడైన యషువ మెస్సీయ ప్రకటిస్తున్నాడు. కాబట్టి మన జీవిత కాలపర్యంతము నిలకడైన విశ్వాసం కలిగి జీవించాలి. మన పితరులు కూడా వారి వారి జీవిత కాలాలలో ఎన్నో భయంకరమైన శోధనలు, వాటివల్ల వచ్చిన బాధలనన్నిటిని సహించి తమ విశ్వాసాన్ని కాపాడుకున్నారు. విశ్వాసం కలిగిన వారై మరణించారు. తద్వారా తమ నిత్యస్వాస్థ్యమైన పరలోకమును చేరుకోవడానికి వేచిచూస్తున్నారు. మనం వారి జీవితాలను ఆదర్శంగా తీసుకొని వారి బాటలో నడిచినట్లయితే మనం కూడా ఆ నిత్య రాజ్యాన్ని స్వతంత్రించుకోగలము.

సహోదరులారా! ఎలోహీంనందు నిజముగా విశ్వసించిన ప్రతీ ఒక్కరికి ఎన్నో శోధనలు, బాధలు కలుగుతాయి. అపవాదియైన సాతాను ఎలాగైన విశ్వాసులను వారి విశ్వాసమునుండి తొలగింపజేసి ఎలోహీంయొక్క రక్షణ నుండి వారిని దూరం చేయాలని ఎన్నో ప్రయత్నాలు చేస్తూనే ఉంటాడు. అటువంటి సమయాలలో ఎలోహీంనందు పరిపూర్ణమైన విశ్వాసముంచి ఆయన మీదనే ఆధారపడినట్లయితే మనల్ని రక్షించుకోగలుగుతాము. నిజానికి మనకు ఎదురయ్యే శోధనలు, బాధలు విశ్వాస విషయంలో మనలను మరింతగా రాటుదేల్చడానికే నన్నది ప్రతీ విశ్వాసి గ్రహించాలి.: **నశించిపోవు సువర్ణము అగ్ని పరీక్ష వలన శుద్ధపరచబడుచున్నది గదా? దానికంటె అమూల్యమైన మీ విశ్వాసము ఈ శోధనల చేత పరీక్షకు నిలిచినదై యషువ మెస్సీయ ప్రత్యక్షమైనప్పుడు మీకు మెప్పును మహిమయు ఘనతయు కలుగుటకు కారణమగును.** (1పేతురు 1:7) అని అపోస్తలుడైన పేతురు ప్రకటిస్తున్నాడు. **శోధన సహించువాడు ధన్యుడు; అతడు శోధనకు నిలిచినవాడై ఎలోహీం తన్ను ప్రేమించువారికి వాగ్ధానం చేసిన జీవకిరీటము పొందును** (యాకోబు 1:12) అదే విధంగా అపోస్తలుడైన సౌలు విశ్వాసమునుబట్టి ప్రియకుమారుడైన తిమోతికి ఈ విధంగా పత్రిక వ్రాస్తున్నాడు. **మంచి పోరాటము పోరాడితిని. నా పరుగు కడముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని. ఇకమీదట నా కొరకు, నా కొరకు నీతికిరీటముంచబడియున్నది** (2తిమోతి 4:7). మరి అపోస్తలులవలె మనం మన విశ్వాసాన్ని కాపాడుకున్నట్లయితే ఆ నిత్య రాజ్యంలో ప్రవేశించగలుగుతాము. మన పితరుడైన అబ్రహాము ఎలోహీంయందు విశ్వాసముంచాడు. అది అతనికి నీతిగా ఎంచబడింది. ఆయన విశ్వాసానికి ఎన్నో పరీక్షలు ఎదురయ్యాయి. వాటినన్నిటిని ఎంతో సహనంతో ఎదుర్కొని తన విశ్వాసాన్ని కాపాడుకొన్నాడు. విశ్వాసులందరికీ తండ్రి అయ్యాడు. అబ్రహామును బట్టి సకల జనములు ఆశీర్వదించబడ్డాయి. మరి అటువంటి విశ్వాసం మనకుందో లేదో పరీక్షించుకోవాలి. ఇస్సాకు, యాకోబు, యోసేపు, మోషే మొదలగు భక్తుల యొక్క విశ్వాసమును ఆది అపోస్తలుల విశ్వాసమును మనం మాదిరిగా తీసుకోవాలి.

సహోదరులారా! ఎలోహీంయందు విశ్వాసముంచినట్లయితే మనం పరిశుద్ధాత్మ యొక్క శక్తిని పొందుకుంటాం. ఆ శక్తి వలన ఎనలేని ధైర్యం వస్తుంది. ఆ ధైర్యముతో మనం సాతానును ఎదిరించగలుగుతాం. ఎలోహీం కొరకు గొప్ప కార్యాలు చేయగలుగుతాము. రాజైన దావీదు ఒంటరిగా సింహాన్ని, ఎలుగుబంటిని ఎదుర్కొన్నా, రాక్షసుడైన గొల్యాతును ఎదుర్కొన్నా విశ్వాసం వల్ల కల్గిన ధైర్యమును బట్టియే. అదేవిధంగా అమాలేకీయులు సిక్లగు మీద పడి సర్వం దోచుకొనిపోయినా, తన తోటి ప్రజలు తనను చంపజూచినా ఎలోహీంయైన యావెను బట్టి దావీదు ధైర్యము తెచ్చుకున్నాడు. ఆ ధైర్యముతోనే తన శత్రువులను సంహరించి తను పోగొట్టుకున్నదాని కన్నా ఎక్కువగా తిరిగి తెచ్చుకున్నాడు. ఇశ్రాయేలీయుల నాయకుడైన యెహోషువ తమ ఎలోహీం యైన యావె యందు అత్యంత విశ్వాసం కలిగి ఉండేవాడు. తన తోటి వేగులు ఎంతగా బలహీన పరచినా తను మా త్రం ఆ వాగ్ధాన దేశమును స్వతంత్రించుకొంటామనే విశ్వాసం కలిగి ఉండేవాడు. చివరకు స్వతంత్రించుకున్నాడు. యెహోషువ యొక్క విశ్వాసానికి యెరికో గోడలు కూలిపోయాయి! సూర్యుడు నిలిచెను!! చంద్రుడు ఆగెను!! **యావె ఒక నరుని మనవి వినిన ఆ దినము వంటి దినము దానికి ముందేగాని దానికి తరువాతనే గాని యుండలేదు;** అంతటి విశ్వాసం కలిగిన నరుడు యెహోషువ!!! ఎలోహీం యందు విశ్వాసముంచువారు ప్రతీ విషయంలోనూ ఎలోహీం మీదనే ఆధారపడాలి. అలా ఆధారపడినవారికే ఎలోహీం వద్దనుండి సహాయం లభిస్తుంది. మేలు జరుగుతుంది. ఇశ్రాయేలీయులను రాజులు పరిపాలిస్తున్న కాలములో ఏ రాజు అయితే యావె యందు విశ్వాసము ఉంచి ఆయన యందు భయభక్తులు కలిగి జీవించేవారో ఆ రాజు కాలంలో ప్రజలు కూడా యావె యందు భయభక్తులు కలిగి ఉండేవారు. ఆశీర్వదింపబడి అభివృద్ధి చెందేవారు. ఏ రాజు అయితే వారి పితరుల ఎలోహీం అయిన యావెను విడచి విగ్రహాలను పూజించేవారో ఆ రాజు కాలంలో ప్రజలు కూడా విగ్రహాలను పూజించి యావె యొక్క ఆగ్రహానికి గురై నాశనము తెచ్చుకునేవారు. యధా రాజా తథా ప్రజ అన్నట్లుగా సాగింది. యావె యందలి విశ్వాసముంచిన రాజులలో దావీదు, ఆసా, యెహు, యెహోషాపాతు, హిజ్కియా, యోషియా ముఖ్యులు. యూదారాజైన ఆసా పరిపాలనా కాలంలో కూషీయుడైన జెరహు పదిలక్షల మంది సైన్యముతో మూడువందల రథములతో యూదావారి మీదికి యుద్ధానికి రాగా ఆసా తన ఎలోహీం అయిన యావెకు మొఱ్ఱపెట్టి-**యావె, విస్తారమైన సైన్యము ఓడిపోకుండా బలము లేని వారికి సహాయము చేయుటకు నీకన్న ఎవరును లేరు; మా ఎలోహీం మాకు సహాయము చేయుము, నిన్నే నమ్ముకొని యున్నాము, నీ నామమునుబట్టియే యీ సైన్యమును ఎదిరించుటకు బయలుదేరియున్నాము....**(2దిన 14:11-15) అని ప్రార్థించగా యావె ఆ కూషీయులను మొత్తినందున వారు పారిపోయారు. గెరారు చుట్టునున్న పట్టణములలోని వారందరి మీదికి యావె భయము వచ్చెను గనుక ఆ పట్టణములన్నిటిని కొల్లపెట్టి వాటిలోనున్న మిక్కుటమైన కొల్లసొమ్మంతయు దోచుకున్నారు. మరియు విస్తారమైన గొఱ్ఱెలు, ఒంటెలను సమకూర్చుకొని యెరూషలేమునకు తిరిగి వచ్చారు. ఆ విధంగా రాజైన ఆసా విశ్వాసమునుబటికట ఆసా యేలుబడియందు ముప్పది అయిదవ సంవత్సరముల వరకు యుద్ధములు జరుగలేదు. **అంతటి విశ్వాసపరుడైన ఆసా** తన యేలుబడియందు ముప్పది ఆరవ సంవత్సరమున ఇశ్రాయేలు రాజైన బయెషా యూదావారిమీద దండెత్తి బయలుదేరి యూదా రాజైన ఆసా యొద్దకు రాకపోకలు జరుగకుండునట్లు రామాను కట్టింపగా ఆసా ముప్పై అయిదు సంవత్సరాలుగా తనను కాపాడుచున్న సైన్యములకు అధిపతియగు యావెను ఆశ్రయించుట మాని, యావె మందిరమందును రాజనగరునందును ఉన్న బొక్కసములలోని వెండి బంగారములను తీసి, అన్యుడైన సిరియా రాజగు బెన్హదదు చేతిలో పెట్టి వ్యవహారం సెటిల్ చేసుకుంటాడు. ఈ విధంగా ఆసా మతి తప్పి ప్రవర్తించినందున అతని యేలుబడియందు ముప్పది తొమ్మిదవ సంవత్సరమున పాదములలో జబ్బు పుట్టి తాను బహు బాధ పడినను దాని విషయములో యావె యొద్ద విచారణ చేయక వైద్యులను పట్టుకున్నాడు (2దిన 16:12). కాబట్టి సహోదరీ సహోదరులారా! కొన్ని విషయములలోనేకాక అన్ని విషయములలో మనం పూర్తిగా ఎలోహీం అయిన యావెను ఆశ్రయించాలి అని యూదా రాజైన ఆసా ఉదంతం వలన మనం గ్రహించగలము.

అదేవిధముగా యూదా రాజైన హిజ్కియా ఎలోహీం యైన యావె యందు అధికమైన భయభక్తులు కలవాడు కాబట్టే ఎలోహీం మందిరం విషయంలోనూ, మందిర సేవా కార్యక్రమములన్నిటియందు, ధర్మశాస్త్ర విషయమందేమి ఎక్కువగా ఆసక్తి చూపేవాడు. ఎలోహీంనకు సంబంధించిన ప్రతీ కార్యక్రమమును హృదయపూర్వకంగా జరిగించి వర్థిల్లాడు. ఒకసారి అష్షూరు రాజైన సన్హెరీబు యూదా దేశము మీదికి దండెత్తి వచ్చాడు. అతడు తన సేవకులను పంపి యూదా ప్రజలు అధైర్యపడే విధంగా తన సేవకులతో వార్నింగులు ఇప్పిస్తాడు. అతని సేవకులలో ఒకడైన రబ్షాకే తన గర్వపు మాటలతో మరి విపరీతంగా యూదా ప్రజలను భయభ్రాంతులునుగా చేస్తాడు. అంతేగాక ఎలోహీం అయిన యావెకు విరోధముగా తన దేవతలను గొప్పవాటిగా చిత్రీకరించి వారి బారినుండి మిమ్ములను ఎవడూ విడిపింపలేడని అవాకులుచవాకులు పేలుతాడు. అప్పుడు రాజైన హిజ్కియా తన ప్రజలైన యూదావారితో **మీరు దిగులుపడకుడి.....అతనికి కలిగియున్న సహాయముకంటె ఎక్కువ సహాయము మనకు కలదు....మనకు సహాయము చేయుటకును మన యుద్ధములను జరిగించుటకును మన ఎలోహీం అయిన యావె మనకు తోడుగానున్నాడు.** (2దిన 32:7-8) అని తన ప్రజలను ధైర్యపరుస్తాడు. హిజ్కియా విశ్వసించిన విధంగానే యావె తన దూతను పంపి అష్షూరు దండు సైనికులను వారి అధిపతులను నాశనం చేయించాడు. యావెకు విరోధంగా అవాకులు చెవాకులు పేలిన అష్షూరు రాజైన సన్హెరీబు సిగ్గుతో తన దేశానికి తిరిగిపోయాడు. అచ్చట అతని కడుపున పుట్టిన వారే కత్తిచేత చంపారు. ఒకసారి హిజ్కియా మరణకరమైన రోగము కలుగగా ఆ రోగమును నయం చేయగల శక్తి పరమవైద్యుడైన యావెకు ఉందని గ్రహించి కన్నీళ్ళు విడుచుచూ యావెకు ప్రార్థన చేసాడు. వెంటనే మరణదశలో హిజ్కియాకు పదిహేను సంవత్సరాల ఆయుష్షును పరమతండ్రి అనుగ్రహించాడు. కాబట్టి ఎలోహీంనందు విశ్వాసముంచుచున్నాము అనే ప్రతీఒక్కరు బాధలు వచ్చినా, ఎంతటి మరణకరమైన రోగములు వచ్చినా మనం విశ్వాసముతో విడువక ఎలోహీంను ప్రార్థించినట్లయితే ఆయన తప్పక మన బాధలనుండి, విడుదల కలుగజేస్తాడు. రోగాలను స్వస్థతపరుస్తాడు. దావీదు కుమారుడైన సొలొమోను ఇశ్రాయేలీయులలో రాజులలో ఎవరికీ లేనంత విస్తారమైన ధనమును, అపరిమితమైన జ్ఞానమును, లోకస్తులందరి కంటె ఘనతను పరమతండ్రియైన యావె అనుగ్రహిస్తాడు. అంతేగాకుండా ఎంతో ఖ్యాతి వహించిన యరూషలేము ఆలయము నిర్మించే అవకాశము సొలొమోనుకే కల్పించాడు. కాని సొలొమోను మాత్రం తన తండ్రియైన దావీదు వలె కడవరకు ఎలోహీంయైన యావెను వెంబడించలేకపోయాడు. అవసాన దశలో అన్యస్త్రీలైన అతని భార్యలు, ఉంపుడుగత్తెలు అతనిని విగ్రహారాధనకు పురికొల్పారు. "దావీదు నా హృదయానుసారుడు" అని ఎలోహీం దావీదును బట్టి సంతోషించాడు గాని సొలొమోనును బట్టి సంతోషించలేదు. దీనిని బట్టి మనం గ్రహించవలసినదేమిటంటే ఎలోహీం పట్ల మనకున్న విశ్వాసాన్ని మరణం వరకు కాపాడుకోవాలి. సాతాను మనలను ఎలోహీం నుండి దూరం చేయడానికి అనేకమైన ఉచ్చులు పన్నుతాడు. ధనం, పదవి, స్త్రీ మొదలగునవి ఈ ఉచ్చులలో ప్రధానమైనవి. ప్రతి విశ్వాసి వీటి విషయమై ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి.

ఒకసారి అపోస్తలులు-**మా విశ్వాసం వృద్ధి పొందించుమని ఎలోహీంయైన యషువ మెస్సీయతో చెప్పగా, ఎలోహీం-మీరు ఆవగింజంత విశ్వాసం గలవారైతే ఈ కంబళి చెట్టును చూచి-నీవు వ్రేళ్ళతోకూడ పెల్లగింపబడి సముద్రములో నాటబడుమని చెప్పునప్పుడు అది మీకు లోబడును.** అని సమాధానమిచ్చాడు (లూకా 17:6) ఆవగింజ చాలా చిన్నది. మరియు ఎటువంటి వంపులు లేకుండా గుండ్రంగా ఉంటుంది. వంపులు లేకుండా గుండ్రంగా ఉండడమనేది ఎటువంటి సందేహాలు లేకుండా పరిపూర్ణమైన విశ్వాసానికి గుర్తు. ఆ విధమైన విశ్వాసం కలిగి ఉండాలనేదే యషువ మెస్సీయ యొక్క ఉద్దేశ్యము. ఆయనతో జీవిస్తూ, ఆయన చేస్తున్న అద్భుత కార్యాలన్నీ కళ్ళారా చూస్తున్నా సరే అటువంటి విశ్వాసం కలిగి ఉండలేకపోయేవారు. అందుకే యషువ మెస్సీయ తన శిష్యులను **అల్పవిశ్వాసులారా, విశ్వాసము లేని మూర్ఖతరమువారలారా, నేనెంత కాలము మీతో ఉంటాను? ఎంతవరకు మిమ్మును సహింతును?** (మత్తయి 17:16,17) అని గద్దించాడు. యషువ మెస్సీయ శరీరధారిగా ఉన్న కాలములో వాక్యవిషయములో ఉద్దండులైన శాస్త్రులు, పరిసయ్యులు ఆయన ఎవరో తెలుసుకోలేక ఆయన యందు విశ్వాసముంచలేకపోయారు కాని ఎంతోమంది సామాన్య ప్రజలు ఆయనే రాబోవు మెస్సీయ అని విశ్వసించి ఆయనను వెంబడించారు. వారి రోగాలనుండి విడుదల పొందారు. పాపాలనుండి విడుదల పొందారు, మృతినొందినవారు సహితము సజీవులైనారు. ఆ తరమువారికంటె మనం మరి ధన్యులమని లేఖనం సెలవిచ్చుచున్నది. ఎందుకంటే **చూచినమ్మిన వారి కంటె చూడక నమ్మిన వారు ధన్యులు అని సర్వాధికారియైన యషువ మెస్సీయ సెలవిచ్చుచున్నాడు.** ఆ సంగతి గుర్తెరిగి మనము పరిపూర్ణ విశ్వాసము కలిగి యషువ మెస్సీయను నమ్మినట్లయితే **అలా నమ్మినవారికి సమస్తమును సాధ్యమే** అని యషువ మెస్సీయ వాగ్ధానము చేయుచున్నాడు. **విశ్వాసంలో ఎవనికైనను జ్ఞానము కొదువుగా ఉన్నట్లయితే ఏ మాత్రమును సందేహింపక విశ్వాసముతో ఎలోహీంను అడగాలి** (యాకోబు 1:2-8) అని అపోస్తలుడైన యాకోబు ప్రకటిస్తున్నాడు. **సందేహముతో కూడిన విశ్వాసము** చాలా ప్రమాదకరము. దీనివల్ల ఎలోహీం వద్దనుండి శాపం వస్తుంది తప్ప దీవెన రాదు. పేతురును చూడండి! ఆయన యషువను చూచి ధైర్యముతో సముద్రము మీద నడక మొదలుపెట్టి మధ్యలో అలలను చూచి సందేహపడ్డాడు. అంతే సముద్రములో మునిగిపోసాగాడు. అహాబు కుమారుడైన యెహోరాము కాలములో ఇశ్రాయేలీయులమీదకు సిరియా రాజైన బెన్హదదు తన సైన్యమంతటితో వచ్చి షోమ్రోనును ముట్టడించాడు. పట్టణంలో ఘోరమైన క్షామం వచ్చింది. అప్పుడు ఎలోహీం అయిన యావె ప్రవక్తయైన ఎలీషా ద్వారా "ఒక రోజులో పరిస్థితి మారుతుంది. ఆహార పదార్థాలు విరివిగా లభిస్తాయి" అని ప్రకటింపజేసాడు. కాని ఆ రోజు అధిపతులలో ఒకడు **ఆకాశమందు కిటికీలు తెరచినను అలాగు జరుగునా?** అని సందేహపడ్డాడు. "యావె" తన వాగ్ధానం ప్రకారము మరుసటి రోజు అదేవిధంగా జరిగించాడు. అవిశ్వాసియైన అధిపతి మాత్రం తన అవిశ్వానికి శిక్షగా జనులచేత త్రొక్కి చంపబడ్డాడు. విశ్వాసులలో ఎవరైనను బలహీనపడితే అటువంటి వారిని విశ్వాసులైన సహోదరులు ఆదరించాలి. మరళా ఆ విశ్వాసిని విశ్వాసములో స్థిరపరచాలి. అలా చేయడంవల్ల ఒకనినొకరు విశ్వాసములో మరింతగా బలపడతాము. (రోమా 1:11) యషువ మెస్సీయ నందు విశ్వాసముంచువాడు **తన స్వకీయులను, విశేషముగా తన యింటి వారిని సంరక్షింపక పోయిన యెడల వాడు విశ్వసత్యాగము చేసినవాడై అవిశ్వాసికన్నా చెడ్డవాడై యుండును** (1తిమోతి 5:8) కాబట్టి ప్రతి విశ్వాసియైన కుటుంబ యజమాని మిగిలిన కుటుంబ సభ్యులను కూడ విశ్వాసములో నడిపించాలి.

**పాపులను రక్షించడానికి యషువ మెస్సీయ ఈ లోకానికి వచ్చెనను వాక్యము నమ్మతగినదియు పూర్ణాంగీకారమునకు యోగ్యమైనదియునై యున్నది. అట్టి వారిలో నేను ప్రధానుడను** అని అపోస్తలుడైన సౌలు ప్రకటిస్తున్నాడు. అంతేగాక అదే విశ్వాసము కలిగి ఉండాలని తిమోతికి చెబుతున్నాడు. ఆ విశ్వాసము నిమిత్తమై మంచి పోరాటం చేయాలని తిమోతిని ఆజ్ఞాపించుచున్నాడు. ఈ విశ్వాసములో కొందరు తప్పిపోయి ఓడ బద్దలైపోయినవారివలె చెడిపోయిన వారు ఉన్నారు. వారిలో హుమెనైయును అలెక్సంద్రును ఉన్నారు. ఇటువంటి వారికి పరలోక ప్రాప్తి కలుగదు గాని శిక్షకొరకై సాతానుకు అప్పగింపబడతారు. 1తిమోతి 1:18-25. **"పునరుత్థానమును జీవమును నేనే"** అని యషువ మెస్సీయ ప్రకటిస్తున్నాడు. ఆయనయందు విశ్వాసముంచు చనిపోయినా బ్రదుకును. బ్రతికి ఆయనయందు విశ్వాసముంచిన వాడు ఎన్నటికి చనిపోడు. అపోస్తలులు ఇదే విషయాన్ని విశ్వసించారు. దానినే ప్రకటించారు. అయితే పునరుత్థానము గతించెనని చెప్పుచు సత్యము విషయము తప్పిపోయి కొందరి విశ్వాసమును చెరపుచ్చుచున్నారు. వీరిలో హుమెనైయును, ఫిలేతు ఉన్నారని అపోస్తలుడైన సౌలు ప్రకటించుచున్నాడు. యషువ మెస్సీయ నందలి విశ్వాస విషయంలోభ్రష్టులై సత్యమును ఎదురించువాడు ఆ కాలమునుండి ఈ కాలము వరకు ఉంటూనే ఉన్నారు. వీరు యన్నే, యంబ్రే అను వారు. మోషేను ఎదిరించినట్లు యషువ మెస్సీయనందలి విశ్వాసులను ఎదిరిస్తారు. ఇలాంటి వారికి మనం దూరంగా ఉండాలి. వీరికి మనం "షలోం" అని కూడా చెప్పకూడదు. వీరితో అస్సలు సాంగత్యం చేయకూడదు (2తిమోతి 3:8,9), (2యోహాను 9-11). విశ్వాసులందరూ సాధారణముగా అవికావాలని, ఇవి కావాలని పరమతండ్రికి మొఱ్ఱపెడుతుంటారు. అయితే వీరి ప్రార్థనలు పూర్ణవిశ్వాసముతో చేసినవి కానందున వీరు కావల్సినవి పొందలేకున్నారు. **అందుచేత ప్రార్థన చేయునప్పుడు మీరు అడుగుచున్న వాటినెల్లను పొందియున్నామని నమ్ముడి; అప్పుడు అవి మీకు కలుగునని రక్షకుడైన యషువ మెస్సీయ మనతో చెప్పుచున్నాడు.** (మార్కు 11:24) ఈ వాక్యాన్ని ఆధారం చేసుకొని కొరియా దేశమునకు చెందిన "పాల్‌యాంగిచో" అనేక మందిని స్వస్థపరచాడు. ఈ విధముగా "మనం ప్రార్థన చేసినప్పుడే మనకు కావల్సినవి పొందాము" అని నమ్మడాన్నే పాల్ యాంగిచో అనే భక్తుడు నాల్గవ కోణం అనేవాడు. మన పితరులలో అనేకమంది ఆ విధంగానే నమ్మి తమకు కావలసినవి పొందగలిగారు. **ఎల్కానా భార్యయైన హన్నా** తను చాలా కాలం నుండి గొడ్రాలు ఉండుటవలన ఎంతో దు:ఖముతో యావె సన్నిధిలో తన ఆత్మను కుమ్మరించింది. తనకొక మగపిల్లవాడు కావాలని తన మనస్సులోనే పరమతండ్రిని వేడుకొంది. ఆ రోజునుండి ఆమె దు:ఖపడడం మానివేసింది. సమూయేలుకు జన్మనిచ్చింది. అంతేగాని ప్రార్థన చేసుకొని ఆ తర్వాత తనకు పిల్లలు పుడతారా పుట్టరా అంటూ అనుమానంతో ఏడుస్తూ కూర్చోలేదు. **"మెలకువగా ఉండుడి, విశ్వాసమందు నిలకడగా ఉండుడి, పౌరుషముగలవారై యుండుడి, బలవంతులై యుండుడి"** (1కొరింథీ 16:13,14) అని అపోస్తలుడైన సౌలు ప్రకటిస్తున్నాడు. మనలో కార్యసాధకమైన తన శక్తి చొప్పున మనము అడుగు వాటన్నిటికంటెను అత్యధికముగా చేయు శక్తిగల ఎలోహీంనకు, యషువ మెస్సీయ మూలముగా సమాజములో తరతరములు సదాకాలము మహిమ కలుగును గాక ఆమేన్.

- బ్రదర్ పి. రాజు